ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

ఆదివారం 5 జులై 2026 | సంపుటి: 1 సంచిక: 18 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad

## 12 వేల మందికి అమరనాథ్ తొలి దర్శనం

కట్టుదిట్టమైన భద్రత... వాతావరణ అవాంతరాల మధ్య ... హర హర మహాదేవ్ అంటూ... బయల్దేరిన భక్తులకు ఈ ఏడాది అమరనాథ్ మంచుశివలింగ తొలి దర్శనమైంది. అమరనాథ్‌యాత్రలో భాగంగా శుక్రవారం తొలిరోజు 12 వేల మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకున్నారు.

- జమ్ము, జులై 4 (సింగిడి)

2





అభివృద్ధి కార్యక్రమాల్లో
## వేగం పెంచాలి

క్యూర్ పరిధిలో
అర్బన్ హౌసింగ్ కు అత్యంత ప్రాధాన్యత

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు
ఆధునిక శాశ్వత భవనాలు

అధికార యంత్రాంగానికి
మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

2



ఇరాన్ సుప్రీం ఖమేనీ
## అంత్యక్రియలు ప్రారంభం

భారత బృందంలో బీహార్ గవర్నర్, కేంద్రమంత్రి

అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మరణించిన 86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు.

- టెహ్రాన్, జులై 4 (సింగిడి):

2



బలోచిస్థాన్‌లో
## ఆత్మాహుతి దాడి

30 మంది పాక్ భద్రతా సిబ్బంది మృతి..!

బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. తాజాగా బలోచిస్థాన్‌లోని జివానీలో గల పాకిస్థాన్ కోస్ట్ గార్డ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి జరిపినట్లు ప్రకటించింది. ఈ ఘటనలో 30 మంది పాక్ జవాన్లు మరణించినట్లు పేర్కొంది.

- బలోచిస్థాన్, జులై 4 (సింగిడి)

2



## బంగారంతో లోదుస్తుల తయారీ

ఇరాక్ ఎంపి అవినీతి బట్టబయలు

బాత్‌రూమ్‌లోని కమోడ్‌లను కూడా కొందరు సంపన్నులు బంగారంతో తయారు చేసుకున్న ఉదంతాలు మనకు తెలుసు. కానీ ఇరాక్ లోని ఒక ఎంపీ ఇంటిపై దాడి చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు విలువైన వజ్రాలు, బంగారం, కట్టల కట్టల డబ్బు, ఖరీదైన వస్తువులు చూసి ఆశ్చర్య పోలేదు కానీ, బంగారంతో తయారు చేసిన ఖరీదైన లో దుస్తుల జతను చూసి షాక తిన్నారు.

- బాగ్దాద్, జులై 4 (సింగిడి)

2



పాపికొండల యాత్ర
## మళ్లీ ప్రారంభం

రాజమండ్రి, భద్రాచలం నుంచి యధావిధిగా యాత్ర

భద్రతా కారణాల దృష్ట్యా గత జూన్ చివరి వారంలో తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రపంచ ప్రసిద్ధ పాపికొండలు బోటింగ్ విహారయాత్రకు ఎట్టకేలకు అధికారులు మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు

- రాజమండ్రి, జూలై 4 (సింగిడి)

2

# అయోధ్య రామ రామ

## అయోధ్య ఆలయంలో విరాళాల చోరీ కలకలం

అయోధ్యలో శ్రీరాముడి ఆలయంలో విరాళాల చోరీ ఘటన వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా భక్తులను కలచివేసింది. కోట్లాది మందే భక్తులు తమ భక్తికి గుర్తుగా సేమర్పించిన విరాళాలపై అక్రమాలు జరిగాయనే వార్తతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాముడి గుడిలోనే ఇలా జరిగితే... ఇక భక్తుల విశ్వాసానికి రక్షణ ఎక్కడ? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన కేవలం డబ్బు చోరీకి సంబంధించినది మాత్రమే కాదని... భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- హైదరాబాద్ బ్యూరో (సింగిడి)

### దేశవ్యాప్తంగా భక్తుల్లో ఆందోళన

దేవుడి సొమ్ముకే రక్షణ లేకపోతే ఎలా?...

ఆలయాల నిర్వహణపై పెరుగుతున్న ప్రశ్నలు



**భక్తి పేరుతో ఇచ్చింది... భద్రంగా ఉందా..?**

ఒక భక్తుడు హుండీలో వేసే వంద రూపాయలు... మరొకరు సమర్పించే లక్ష రూపాయలు... వాటి విలువ కేవలం డబ్బులో కాదు... ఆ విశ్వాసంలో ఉంటుంది. ఎవరి కోరిక నెరవేరినా... ఎవరి మొక్కు తీరినా... దేవుడికి కానుక సమర్పించడం భారతీయ సంప్రదాయం. అలాంటి విరాళాలపైనే అక్రమాలు జరిగాయనే వార్తలు రావడం భక్తుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. మేం దేవుడిని నమ్మి ఇచ్చిన కానుకను కాపాడలేకపోతే... వ్యవస్థపై ఎలా నమ్మకం పెట్టుకోవాలి? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఆధ్యాత్మిక క్షేత్రాలా? లేక ఆర్థిక కేంద్రాలా..?**

దేశంలోని ప్రముఖ దేవాలయాలకు ప్రతిరోజూ కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. విరాళాలు, బంగారం, నగలు, ఇతర కానుకల రూపంలో భారీ మొత్తాలు చేరుతున్నాయి. దీంతో ఆలయాల నిర్వహణలో పారదర్శకత, లెక్కల నిర్వహణ, భద్రత, ఆడిట్ వ్యవస్థలపై మరింత బాధ్యత ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. భక్తుల విశ్వాసం ఎంత పెరుగుతుందో... నిర్వహణలో బాధ్యత కూడా అంతే పెరగాలి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఇది ఒక ఆలయానికే పరిమితమా..?**

అయోధ్యలో జరిగిన ఘటనతో దేశంలోని ఇతర ప్రముఖ ఆలయాల నిర్వహణపై కూడా చర్చ మొదలైంది. తిరుమల, శ్రీశైలం, యాదాద్రి, వైష్ణోదేవి, సిద్దివినాయక్ వంటి ప్రముఖ ఆలయాల్లో విరాళాల నిర్వహణ ఎలా జరుగుతోంది? ఎలాంటి ...మిగతా 2లో

## రంకెలు వేసినంత మాత్రాన.. అంకెలు మారవు

### హరీశ్‌రావు

**బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు.** - హైదరాబాద్, జులై 4 (సింగిడి)

రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. “ బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోంది” అని విమర్శించారు.



మిడ్జిల్‌లో నాటిన మొక్క..
## మహావృక్షమైంది

పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం

మిడ్జిల్ మండల అభివృద్ధి బాధ్యత ఇక భట్టిదే

ఆ కుటుంబాలకు వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయి

మిడ్జిల్ రాజకీయ కృతజ్ఞతా సభలో సిఎం రేవంత్ రెడ్డి

2



ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై, ప్రజలకు చేవ చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తుచేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు.

-మహబూబ్‌నగర్,జూలై 4 (సింగిడి)

## నిజామైన ప్రజానాయకుడు మన రేవంత్

మిడ్చిల్ సభలో సిఎం రేవంత్‌పై భట్టి ప్రశంసలు


2

యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని
## అధిగమించాం

ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి

అయితే సమర్థంగా సవాళ్లను అధిగమించగలిగాం

రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోదీ



2

పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదఅని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ–పెట్రోకెమికల్ కాంప్లెక్సను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు.

- జయపుర,జులై 4 (సింగిడి)

పార్టీ పేరు మార్చాలంటూ
## ఈసీ ఆదేశం

ఘాటుగా స్పందించిన కవిత

- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత



2

## ప్రభుత్వ అజెండాలో కీలక బిల్లులు

జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ

**జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు**

**మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ**

**మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం**

**శివసేన, తృణమూల్ రెబల్ ఎంపీల విలీనంతో ఎన్డీయే బలం పెరిగే ఛాన్స్**

**తీవ్ర నేరాల్లో జైలుకెళ్తే పదవులు రద్దు చేసే బిల్లును ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం**



2

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన ‘ఎక్స్’ ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని రిజిజు వివరించారు. - న్యూఢిల్లీ, జులై 4 (సింగిడి)




నగర హోటళ్లలో
## నాణ్యత డొల్ల

అపరిశుభ్ర వాతావరణం..
కల్తీ పదార్థాలు

దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు

వందరోజుల్లో 185 కేసులు నమోదు

2



వర్షాభావ జిల్లాల్లో
## క్షేత్రస్థాయిలో పర్యటించండి

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయండి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ సంజయ్ జాజు

2

# సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం

కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల్ని ప్రారంభించిన సీఎంచంద్రబాబు

డ్రగ్స్, గంజాయిపై మరింత కఠినంగా ఉండాలని పోలీసులకు ఆదేశం

పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన సీఎం చంద్రబాబు

సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ నుంచి ఆస్పత్రి పరిశుభ్రత వరకు ప్రతీ అంశంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటన రెండో రోజు కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించి సేవలను పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు, వైద్యారోగ్య రంగంలోని ఆవిష్కరణలు, డ్రగ్స్ నివారణ చర్యలపై అధికారులతో మాట్లాడారు.

-కుప్పం, జూలై 4 (సింగిడి)



2

రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి
## నెట్‌జీరో విధానం

కుప్పం అంతటా అమలుకు సీఎం ఆదేశం

నెట్‌జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సీఎం పరిశీలన

ప్రభాతనవ | SINGIDI | తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
5 జులై 2026

# పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం

**హైదరాబాద్, జులై 4 (సింగిడి)**

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది. ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత తన కొత్త పార్టీ కోసం 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' అనే ఐదు పేర్లను ఈసీకి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏప్రిల్ 25న మునీరాబాద్‌లో భారీ ఎత్తున నిర్వహించిన ఆవిర్భావ సభలో... తమ పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన' (TRS) అని కవిత స్వయంగా ప్రకటించి, పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. అయితే, ఆ తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే (ఏప్రిల్ 28న) ఈ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మారుస్తూ, ఈ పేరుపై నెల రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. మూడు రోజుల్లోనే 'రాష్ట్ర సేన' కాస్త 'రక్షణ సేన'గా ఎందుకు మారిందనే దానిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత కేడర్‌ను సమాయత్తం చేస్తూ ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఏకంగా వేల సంఖ్యలో అభ్యంతరాలు రావడం, ఈ ఈసీ స్పందన నేపథ్యంలో ఈ 'TRS' పేరు కవితకు దక్కుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

# ఇరాన్ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభం

దేశ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని నల్ల తలపాగా ఉంచిన శవపేటికలో పెట్టి అంతిమ సందర్శనకు ఉంచారు. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ కుటుంబ సభ్యుల పార్థివదేహాలనూ ఆయన పక్కనే ఉంచారు. అందులో ఖమేనీ 14 నెలల మనవరాలి చిన్న శవపేటిక అందరి మనసులను కలచివేస్తోంది. ఆ చిన్నారి శవపేటిక పక్కనే ఆమె ఫొటోను కూడా ఉంచారు. వారం రోజుల అంతిమ సంస్కారాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రమే ఖమేనీ పార్థివదేహం టెహ్రాన్‌కు చేరుకుంది. దీంతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు బారులు తీరారు. శనివారం ఉదయం గ్రాండ్ మొసల్లా ద్వారాలు తెరవగానే వేలాది మంది లోపలికి ప్రవేశించి ఖమేనీకి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలు చేతబట్టి వచ్చిన మద్దతుదారులు అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. వారి నినాదాలతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం మార్మోగిపోతోంది.

# బలోచిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. తాజాగా బలోచిస్థాన్‌లోని జివానీలో గల పాకిస్థాన్ కోస్ట్ గార్డ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి జరిపినట్లు ప్రకటించింది. ఈ ఘటనలో 30 మంది పాక్ జవాన్లు మరణించినట్లు పేర్కొంది. తమ ఫైటర్స్ శిబిరంలోకి చొరబడి, ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారని బీఎల్ఏ ప్రతినిధి మీడియాకు తెలిపారు. అయితే ఈ దాడి, మృతులకు సంబంధించి పాకిస్థాన్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తమకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపు బీఎల్ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో తరచూ సైనిక, పారామిలిటరీ, ఇతర ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతోంది. దీనిని పాకిస్థాన్ ఉగ్రవాదసంస్థగా ప్రకటించింది.

# నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

**హైదరాబాద్,జులై 4 (సింగిడి)**

ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన హెచ్-ఫాస్ట్ అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చి 19న ప్రారంభమైన హెచ్-ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తి అయ్యింది. ఈ వంద రోజుల్లో రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను అధికారులు సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెచ్-ఫాస్ట్ అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదవగా... పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలకు హెచ్-ఫాస్ట్ అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ఈఎఈక్ష విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఆహార ఫిర్యాదులు అందుతున్నట్లు వెల్లడించారు. కల్తీ సమాచారం ఉంటే డయల్ 100, వాట్సాప్, ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం

డిజిటలైజేషన్ తో పాటు డేటా ఇంటిగ్రేషన్ అవసరంకుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజుకు ఎంత మందికి సేవలు అందించగలరని సీఎం ప్రశ్నించారు. రోజుకు 3040 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆస్పత్రిని పరిశీలన సందర్భంగా ఆవరణలో కొంత మేర చెత్త కనిపించడంపై ప్రశ్నించిన ముఖ్యమంత్రి, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే ముఖ్యమని పేర్కొన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచించారు. డయాలసిస్ వార్డును సందర్శించిన సందర్భంగా పొరుగు రాష్టాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు వివరించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని, కుప్పంలో ప్రజలకు ఏ మేరకు మేలు కలిగిందో వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

# రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి నెట్‌జీరో విధానం

**కుప్పం, జూలై 4 (సింగిడి)**

నెట్‌జీరో విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న నలగంపల్లి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కుప్పం పర్యటన రెండో రోజు శనివారం నలగంపల్లిలోని నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి....సోలార్ రూఫ్‌టాప్ సోలార్, ఇండక్షన్ కుకటాపేలు, వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించారు. నలగంపల్లి నమూనాను కేస్ స్టడీగా తీసుకుని కుప్పం వ్యాప్తంగా నెట్‌జీరో విధానాన్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు.సర్క్యులర్ ఎకానమిని గ్రామస్థాయిలో అమలు గ్రామంలోని ఓ ఇంటిని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సోలార్ ప్యానెళ్ల సంఖ్య, విద్యుత్ ఉత్పత్తి, ఇంటి అవసరాలకు సరిపోతుందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం



ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తపదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక టన్నుల నుంచి 54 వేల మెట్రిక టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# రాజకీయాల్లో 20 ఏళ్లు..

రెండు దశాబ్దాల క్రితం మిడ్జిల్‌లో 'రేవంత్ రెడ్డి'గా మొదలైన తన ప్రస్థానం, నేడు ప్రజల ఆదరాభిమానాలతో 'రేవంతన్న'గా వారి గుండెల్లో నిలిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుత ప్రయాణం తన జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అభివర్ణించారు. ఈ 20 ఏళ్ల కాలంలో ప్రతి సంఘర్షణలో, ప్రజల కోసం తాను చేసిన ప్రతి పోరాటంలో అండగా నిలిచిన ఆత్మీయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో 'తెలంగాణ పునర్నిర్మాణ శ్రామికుడి'గా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అన్నింటికీ మించి 'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని మాట ఇచ్చారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# 12 వేల మందికి అమరనాథ్ తొలి దర్శనం

జమ్మూకశ్మీర్‌లోని హిమాలయాల్లో ఏటా ఈ సమయంలో ఏర్పడే మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నువ్వాన్, బాల్‌టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలు బయలుదేరాయి. శుక్రవారం దర్శనం చేసుకున్నవారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**అమరనాథ్ భక్తులకు ప్రధాని మోదీ లేఖ**

యాత్ర మొదలైన నేపథ్యంలో భక్తులకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా రెండు పేజీల లేఖ రాశారు. ఈ సందర్భంగా అయిదు ప్రతిజ్ఞలు చేయాలంటూ వారికి సూచించారు. పరిశుభ్రత పాటించటం.. జమ్మూకశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులకు (వోకల్ ఫర్ లోకల్) ప్రాధాన్యం.. ట్రాఫిక్ నిబంధనలు.. పచ్చదనాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రక్షాబంధన్ రోజు తోబుట్టువులకు బహుమతిగా మొక్కలు.. దేశం ప్రథమం అనే నినాదంతో అమరనాథ్ యాత్రను సాగించాలని భక్తులను ప్రధాని కోరారు.

# వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

**హైదరాబాద్, జులై 4 (సింగిడి)**

తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు సిఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షభావ పరిస్థితులను అధిగమించేందుకు జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని, దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించిన ఆయన, రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, పంటల వైవిధ్యం పై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# అయోధ్య రామ రామ

**మొదటి పేజీ తరువాయి..**

పర్యవేక్షణ ఉంది? ఎన్ని స్థాయిల్లో ఆడిట్లు జరుగుతున్నాయి? అనే ప్రశ్నలు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఒక ఘటన జరిగాక స్పందించడం కంటే... ముందే పటిష్ఠమైన వ్యవస్థలు ఏర్పాటు చేయడం మంచిది కాదా? అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**శిక్ష మాత్రమే కాదు... పారదర్శకత కూడా**

ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అదే సమయంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా శాశ్వత వ్యవస్థలు ఏర్పాటు చేయాలని కూడా సూచిస్తున్నారు. హుండీ లెక్కలపై నిరంతర ఆడిట్లు, డిజిటల్ ట్రాకింగ్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, స్వతంత్ర తనిఖీలు, కాలానుగుణ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

**ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు..**

దేవుడి గుడిలోనే భక్తుల విరాళాలు సురక్షితం కాకపోతే... బాధ్యత ఎవరిది?... కోట్ల రూపాయల విరాళాలు వస్తున్న ఆలయాల్లో పర్యవేక్షణ వ్యవస్థలు ఎంత బలంగా ఉన్నాయి?... ఆలయాల నిర్వహణలో మరింత పారదర్శకత తీసుకురావాల్సిన అవసరం లేదా?... భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**విశ్వాసాన్ని కాపాడాల్సిన సమయం**

ఈ ఘటనలో అసలు నష్టం డబ్బుకు మాత్రమే కాదు... భక్తుల విశ్వాసానికి కూడా జరిగింది. అందుకే ఇప్పుడు భక్తులు కోరుకుంటున్నది ఒక్కటే... రాముడి సొమ్మును కాపాడండి... భక్తుల నమ్మకాన్ని నిలబెట్టండి. ఆలయాలపై ప్రజల విశ్వాసం చెక్కుచెదరకుండా ఉండాలంటే పారదర్శకమైన నిర్వహణ, కఠినమైన పర్యవేక్షణ, బాధ్యులపై వేగవంతమైన చర్యలే సరైన సమాధానమని సామాజిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మిడ్జిల్‌లో నాటిన మొక్క.. మహావృక్షమైంది

తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని ప్రకటించారు. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అపరి ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అపరిల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా మూడెకరాల భూమి ఇచ్చారా కోటి ఎకరాలకు నీరు ఇచ్చారాఇంటికో ఉద్యోగం ఇచ్చారా అంటూ ప్రజలను ప్రశ్నించారు.

# నిజమైన ప్రజానాయకుడు మన రేవంత్

**మహబూబ్‌నగర్,జూలై 4 (సింగిడి)**

తనను ఆదరించిన ప్రజల దీవన పొందాలని, వారికి కృతజ్ఞతలు తెలపాలని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డిది పెద్ద మనసని డిప్యూటి సిఎం భట్టి విక్రామార్క అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపన, పేదలను ఆదుకోవాలన్న ఆకాంక్ష రేవంత్ రెడ్డిలో ఉన్నాయని అన్నారు. రేవంత్‌ను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయనలో ఉదాత్తమైన ఆశయాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెపరికోవడానికి రావడం రేవంత్ రెడ్డి ఉన్నతమైన సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు.

# ప్రభుత్వ అజెండాలో కీలక బిల్లులు

మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్సీపీఐలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ



పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీ-డోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

**హైదరాబాద్, జులై 4 (సింగిడి)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలన్నారు. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# పాపికొండల యాత్ర మళ్లీ ప్రారంభం

**రాజమండ్రి,జూలై 4 (సింగిడి)**

భద్రతా కారణాల దృష్ట్యా గత జూన్ చివరి వారంలో తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రపంచ ప్రసిద్ధ పాపికొండలు బోటింగ్ విహారయాత్రకు ఎట్టకేలకు అధికారులు మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గోదావరి నది ఉధృతి తగ్గుముఖం పట్టడం, పర్యాటక బోట్ల ఫిట్‌నెస్ మరియు భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ యాత్రను అటు రాజమండ్రి పుష్కర ఘాట్ నుండి, ఇటు భద్రాచలం నుండి పర్యాటకుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చారు. ప్రకృతి ప్రేమికులకు, కుటుంబ సమేతంగా ఆహ్లాదకరమైన సమయాన్ని గడపాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం. గోదావరి జలవిహారంలో పర్యాటకులకు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను వీక్షించే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా గండిపోచమ్మ ఆలయం, సుందరమైన పాపికొండలు, మరియు ప్రశాంతమైన పేరంటాలపల్లి ఆశ్రమం వరకు బోటింగ్ ప్రయాణం సాగుతుంది. ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట వేస్తూ లైఫ్ జాకెట్లు మరియు అనుభవజ్ఞులైన సిబ్బందిని బోట్లలో అందుబాటులో ఉంచారు. ఇక టికెట్ ధరల విషయానికి వస్తే పెద్దలకు రూ. 1250, మరియు 5 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు రూ. 1050 గా నిర్ణయించారు. చాలా కాలం తర్వాత బోటింగ్ పునఃప్రారంభం కావడంతో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడనుంది.

# బంగారంతో లోదుస్తుల తయారీ

దీంతో ఈ బికినీ జత సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్న ఈ మహిళా ఎంపీ అలియా నస్సీఫ్ ఇంటి నుంచి అధికారులు 1.33 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ. 148 కోట్లు నగదు, బంగారం, నగలు, వజ్రాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. భవనాలు, ఇతర ఆస్తులను కూడా ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం పట్టుబడిన అక్రమ ఆస్తుల విలువ 8.5 కోట్ల డాలర్లు సుమారు రూ. 809 కోట్లు ఉంటుందని చెప్పారు.

ప్రభాతవర్ణ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 5-7-2026



## అన్ని ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను విజయవంతంగా

# అమలుచేయాలి

- పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పాం సాగును ప్రోత్సహించాలి
- సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు.రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, అక్రమ నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే నానో యూరియా వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని పేర్కొంటూ, అర్హులైన ప్రతి రైతు నమోదు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఫార్మర్ రిజిస్ట్రీ వంద శాతం పూర్తి చేయాలి

**సంగారెడ్డి బ్యూరో, జూలై 4 (సింగిడి):** వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్ లకు సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్ని ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను జిల్లాల్లో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయం, విత్తనాలు, ఎరువుల లభ్యత, ప్రజారోగ్యం, పంటల వైవిధ్యీకరణ, ఫార్మర్ రిజిస్ట్రీ, తాగునీటి సరఫరా, ఇరిగేషన్, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, జిల్లాల వారీగా వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా రైతులను ఆయా పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి పథకాల అమలును వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలును మరింత మెరుగుపరిచేందుకు జిల్లాల్లో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేదని, రైతులకు అవసరమైన అన్ని వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రభుత్వం ప్రతిపాదించిన సన్నరకం వరి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తూ వంద శాతం నమోదు పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, సింగూర్ ప్రాజెక్ట్ మరమ్మత్తులు జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు జోగిపేటలో స్థలాన్ని గుర్తించామని తెలిపారు. డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**నాచారం, జూలై 4 (సింగిడి):** నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే మల్లాపూర్, నాచారం, కాప్రా, హబ్సిగూడ, చర్లపల్లి తదితర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, అత్యవసర చికిత్సలు సైతం సమీపంలోనే లభించే అవ కాశం ఉంటుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఆధునిక సౌకర్యాలతో ఆస్పత్రిని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేయనున్నట్లు చెప్పారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, హెచ్ బి కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సర్ సవరణ ప్రక్రియను పరిశీలన



**అల్వాల్, జూలై 4 (సింగిడి):** అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోనిఅల్వాల్ 192 డివిజన్లో 318 బూతు ఏరియాలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ అల్వాల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వరులు ( సర్ ) ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను ఏ విధంగా చేస్తున్నారో అని బిఎల్ఓ లనుపరిశీలించి వారి అనుమానాలను నివృత్తి చేస్తూతగిన సూచనలను సలహాలను జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ , డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లు సూచించారు. డెత్ కేసుల గురించి, ఓటు షిఫ్ట్ చేయడం గురించి , అసలు ఓటర్ల నమోదు గురించి క్లియర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, 192 డివిజన్ అధ్యక్షులు జ్యోతి యాదవ్, నాగన్న, నితా, గ్లోరీ షీలారావు మధుసూదన్ రావు, విష్ణు, పవన్ పాల్గొన్నారు.

# వృక్షో రక్షతి రక్షితః

వన సంరక్షణే మన సంరక్షణ

చెట్లు పెంచుదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

టీవీఆర్ విద్యాసంస్థల

మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి




**కుత్బుల్లాపూర్ జూలై 4 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీ టి వి ఆర్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థలలో శనివారం వన మహోత్సవ కార్యక్రమం టి వి ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ వన మహోత్సవం అనేది పర్యావరణ పరిరక్షణకు ప్రజా ఉద్యమంగా చేపట్టాలని, ప్రతి ఒక్కరు సంవత్సరానికి కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి ప్రతి సంవత్సరం ఒక్కో మొక్క చొప్పున నాటి సంరక్షిస్తే అటవీ విస్తీర్ణము పెరిగి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుందని దాంతో సమస్త మానవాళి సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని పేర్కొన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే నానుడిని నిజం చేయడానికి వన సంరక్షణ మనసంరక్షణగా భావించాలని, చెట్లు పెంచుదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని నినదించారు. వనాలను విపరీతంగా పెంచితే మన ఊరు పచ్చగా, మన దేశం సుభిక్షంగా ఉంటుందని, భావితరాలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని వివరించారు. సమస్త ప్రాణికోటికి కావలసిన ప్రాణవాయువును అందించే మొక్కలను నాటడమే మానవులు తమ కర్తవ్యం గా భావించాలని వంశీకృష్ణారెడ్డి సూచించారు.

వన సంరక్షణ వేడుకల్లో భాగంగా సత్యవాణి విద్యా నికేతన్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవిసూర ఆధ్వర్యంలో జులై 4న వన మహోత్సవం కార్యక్రమం ఘనంగా చేపట్టారు. విద్యార్థినీ ,విద్యార్థులు ఉపాధ్యాయ బృందం కలిసి ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత, మనం మారితే, మన భవిష్యత్తు మారుతుందనే సందేశాన్ని అందరికీ తెలియజేసే విధంగా ఈ వన మహోత్సవ కార్యక్రమం ప్లే కార్డ్స్ చేత భూమి ఫ్లెక్సీలు పట్టుకొని వృక్ష సంపాదన పెంచుదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినదిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోని పిల్లలందరికీ టి వి ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సూర రవిచంద్రా రెడ్డి అభినందలు తెలిపారు.

## అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోవాలని

# జోనల్ కమిషనర్‌కు వినతి



**అమీన్‌పూర్, జూలై 4 (సింగిడి):** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ, అమీన్పూర్ డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాలని కోరుతూ అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ సూచన మేరకు రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామిని కలిసి బీరంగూడ, అమీన్పూర్ డివిజన్‌లలో నెలకొన్న ప్రజా సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. సమస్యలను సానుకూలంగా స్వీకరించిన మంత్రి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో, అదే వినతిపత్రాన్ని జోనల్ కమిషనర్‌కు సమర్పించారు. వినతిపత్రంలో నవ్యనగర్, నర్రెగూడెం, వాణినగర్, సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట, నారాయణరెడ్డి కాలనీ, సాయి కాలనీ, జయలక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో సిమెంట్ కాంక్రీటు రహదారుల నిర్మాణం, మురుగునీటి కాలువల ఏర్పాటు, తాగునీటి సమస్యల పరిష్కారం, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన 22 ప్రధాన అభివృద్ధి పనులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి సహకారం అందిస్తున్నారని, అదే సహకారంతో సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ పనులు ప్రారంభించేలా చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జోనల్ కమిషనర్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు సిద్ధం చేయించి, ప్రాధాన్యత ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీరంగూడ దేవాలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, మన్నె రవీందర్, రమేష్ యాదవ్, ఈశ్వర్ రెడ్డి, మహేష్ గౌడ్, సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద గొప్ప సంఘసంస్కర్త

### టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



**సంగారెడ్డి బ్యూరో, జూలై 4 (సింగిడి):** స్వామి వివేకానంద గారి వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వార్డులో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గారు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ అంజనేయులు, తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, సీనియర్ నాయకుడు రఘుగౌడ్, సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు రమేష్, మహేష్, వంశీ, రాజు గౌడ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం సభ కోసం ప్రజల తిప్పలు


### బస్సులు లేక ప్రయాణికుల గోస



**ఆమనగల్లు, జులై 04 (సింగిడి):** సీఎం బహిరంగ సభ కోసం ఆర్టీసీ అధికారులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను తరలించడంతో ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బస్టాండ్లు కిక్కిరిసిపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు గమ్యస్థానాలకు వెళ్లలేక తీవ్ర అవస్థలు పడ్డారు. సమయానికి బస్సులు రాక, వచ్చిన బస్సుల్లో రద్దీ విపరీతంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు నరకం అనుభవించారు. అధికార యంత్రాంగం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల రవాణా సౌకర్యాలను విస్మరించడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రయాణికుల కష్టాలను పట్టించుకోకుండా బస్సులను సభకు తరలించడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

## ప్రజాస్వామ్యంలో ఓటే శక్తివంతమైంది

### మాజీ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి



**జవహర్ నగర్, జులై 4 (సింగిడి):** ప్రజాస్వామ్యంలో ఓటే శక్తివంతమైందని అర్హులైన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం చంద్రపురి డివిజన్ బూత్ నెంబర్ 560, 562, 564 లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిట్టా శ్రీవాణి మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ నమోదులో బిఆర్ఎస్ కార్యకర్తలు పకడ్బందీగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, బిఎల్ఓ పాల్గొన్నారు.

## విద్యార్థిని ప్రతిభకు


# “ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సత్కారం

### ఉత్తరాఖండ్ రూర్కెలా ఐఐటిలో జియో టెక్నాలజీ విభాగంలో ప్రవేశం లభ్యం



**కుత్బుల్లాపూర్, జూలై 4 (సింగిడి):** ప్రతి సంవత్సరం ఐఐటిలో ప్రవేశాలకై నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఉత్తరాఖండ్ లోని ఐఐటి రూర్కెల జియో టెక్నాలజీ" విభాగంలో ప్రవేశం సాధించిన కుత్బుల్లాపూర్ సత్ జ్ఞాన్ హై స్కూల్ పూర్వ విద్యార్థిని " కె.అంజలీదేవి" స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో శనివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో బాలురతో పోటీపడుతూ బాలికలు ఎన్నో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అందుకు నిదర్శనం రూర్కెలా ఐఐటీలో ప్రవేశం సాధించిన విద్యార్థిని అంజలీదేవి నిదర్శనమని తెలిపారు. పేదరికంలో పుట్టి చదువు పట్ల ఆసక్తితో చిన్ననాటి నుంచి మంచి విద్యతో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అంచలంచెలుగా ఎదుగుతున్న విద్యార్థిని అంజలీదేవి విద్యాభ్యాసానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, పుట్టిన ఊరికి కన్న తల్లిదండ్రులకు మంచి పేరును తెస్తూ విద్యార్థిని అంజలి దేవి మరింత అభివృద్ధి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ చింతల మానస్, విద్యార్థిని చిన్నాన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులు



**నాచారం, జులై 4 (సింగిడి):** దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ కూడలిలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, గుండారపు శ్రీనివాసరెడ్డి లు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య మహోన్నత వ్యక్తి అని, విసునూరు దొరల నిరంకు శత్వాన్ని నిరసిస్తూ, వెట్టిచాకిరిని నిర్మూలనకై ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉస్మాన్, అల్లాడి కృష్ణ యాదవ్, ఎల్లేష్ యాదవ్, యాదగిరి, నర్సింగ్ రావు, శ్రీశైలం, బక్కయ్య, గట్టయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు. మల్లాపూర్ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సూర్ణం రాజేష్ దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

# ఏ వయసు వారు ఎంతసేపు నడవాలో తెలుసా..?





5 - 12 ఏళ్ల వయస్సున్నవారు: పిల్లల ఎదుగుదలకు, శారీరక దృఢత్వానికి నడక చాలా అవసరం. ఈ వయసు పిల్లలు రోజుకు కనీసం 60 నిమిషాలు నడవాలి. కేవలం నడకే కాకుండా ఆటపాటల ద్వారా కూడా ఈ సమయాన్ని పూర్తి చేయవచ్చు.

13 – 19 ఏళ్లు: చదువుల ఒత్తిడి, మానసిక ఆందోళనలను తగ్గించుకోవడానికి టీనేజర్లకు నడక మేలు చేస్తుంది. వీరు రోజుకు 45 నుండి 60 నిమిషాల పాటు చురుగ్గా నడవడం వల్ల బరువు నియంత్రణలో ఉండటమే కాకుండా, ఏకాగ్రత కూడా పెరుగుతుంది.

20 – 40 ఏళ్లు: ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా ఉండే ఈ వయసు వారు ప్రతిరోజూ 30 నుండి 45 నిమిషాలు మితమైన వేగంతో నడవాలి. దీనివల్ల రక్తపోటు తగ్గడం, కండరాల బలం పెరుగడంతో పాటు రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది.

60 ఏళ్ల లోపు వారు: వయసు పెరిగే కొద్దీ వచ్చే కీళ్ల నొప్పులు, మతిమరుపు వంటి సమస్యలను నడకతో చెక్ పెట్టవచ్చు. రోజుకు 30 నుండి 40 నిమిషాలు నడవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

60 – 75 ఏళ్లు: ఈ వయసులో శరీరాన్ని అతిగా శ్రమ పెట్టకూడదు. సమతుల్యత కోల్పోకుండా ఉండటానికి రోజుకు 20 నుండి 30 నిమిషాలు మితమైన వేగంతో నడిస్తే సరిపోతుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

75 ఏళ్లు పైబడిన వారు: వృద్ధాప్యంలో కదలికలు మందగించడం సహజం. అయితే పడిపోయే ప్రమాదాన్ని తగ్గించడానికి, మానసిక ఉల్లాసం కోసం రోజుకు 15 నుండి 20 నిమిషాలు నడవడం మంచిది. కాగా మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి, ఏదైనా కొత్త వ్యాయామం ప్రారంభించే ముందు ఒకసారి వైద్యుని సంప్రదించడం ఉత్తమం.





## ఎంత ప్రయత్నించినా బరువు తగ్గడం లేదా?

### ఐతే మీ ఆహారంలో వీటిని చేర్చుకోండి

బరువు తగ్గడానికి అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మీరు తినే ఆహారం. ప్రతిదీ మీరు ఏమి తింటున్నారనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ఆహారంలో కేలరీలు తక్కువగా ఉన్న ఆహారాలను చేర్చుకోవాలి.

ప్రస్తుత రోజుల్లో బరువు పెరగడం పెద్ద సమస్యగా మారింది. ప్రతి ఒక్కరూ బరువు తగ్గాలని కోరుకుంటారు. కానీ చాలా మంది ఏం చేసినా బరువు తగ్గడానికి బదులు మరింత పెరుగుతున్నట్లు ఫిర్యాదు చేస్తుంటారు.

అయితే చాలా సార్లు బరువు తగ్గే క్రమంలో కొన్ని తప్పులు జరుగుతాయి. దీంతో బరువు తగ్గడానికి బదులుగా బరువు పెరుగుతుంది. అందుకు కారణం చాలా మందికి రోజుకు ఎన్ని కేలరీలు తినాలో ఖచ్చితంగా తెలియకపోవడమే.



50 ఏళ్లు పైబడిన మహిళలు రోజుకు 1800 కేలరీలు తీసుకోవాలి. బరువు పెరగడంలో మీకు సమస్య ఉండకుండా ఉండటానికి మీరు కేలరీల తీసుకోవడం తగ్గించాలి. బరువు తగ్గడానికి మరో అతి ముఖ్యమైన విషయం తీసుకునే ఆహారం. ఎందుకంటే డైట్‌లో ఉన్న వారికి ప్రతి కెలరీ లెక్కే మరి!

తక్కువ కేలరీలు ఉన్న ఆహారాలు తినడం వల్ల బరువు పెరిగే అవకాశం చాలా తక్కువ. కాబట్టి బరువు పెరగకుండా ఉండటానికి వీలైనంత తక్కువ కేలరీలు తినడానికి ప్రయత్నించాలి. ఇలాంటి వారు యాపిల్, సెలరీ, పుచ్చకాయ, బెర్రీలు, టొమాటలో, కీర వంటి ఫైబర్, నీటి శాతం అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి

## నోరూరించే గోంగూర ఎండు చేపల కూర..

### ఇలా వండి తింటే.. గిన్నె కూడా వదలరు




**కావాల్సిన పదార్థాలు :**
200 గ్రాములు ఎండు చేపలు,
రెండు కప్పులు గోంగూర , రెండు పెద్ద ఉల్లిపాయలు, 4 పచ్చిమిర్చి, రెండు టేబుల్ స్పూన్స్ కారం, అర టీ స్పూన్ పసుపు, ఒక టీ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, 5 టేబుల్ స్పూన్స్ నూనె, పోపు, రుచికి సరిపడినంత ఉప్పును తీసుకోవాలి.



ముందుగా ఎండు చేపలను తీసుకుని ఉప్పు, పసుపుతో బాగా శుభ్రపరచుకోవాలి. వేడి నీటిలో 5 నిమిషాల పాటు నానబెట్టి పక్కన పెట్టుకోండి. స్టవ్ వెలిగించి దానిలో ఆయిల్ వేసి అది వేడయ్యాక గోంగూర ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేసుకుని బాగా ఉడికించి రోట్లో కచ్చా పచ్చాగా దంచి పక్కన పెట్టుకోవాలి.
ఇప్పుడు అదే పాన్ లో ఆయిల్ వేసి పోపు గింజలు, కరివేపాకు ఆకులు, ఉల్లిపాయలు ముక్కలు , కట్ చేసిన పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ బాగా వేయించాలి.
ఆ తర్వాత ముందు క్లీన్ చేసిన ఎండు చేపలను ఈ మిశ్రమంలో వేసి పది నిమిషాల పాటు అలాగే నూనెలో మగ్గనివ్వాలి. గోంగూర పచ్చి వాసన పోయాక , రెండు టేబుల్ స్పూన్స్ కారం, అర టీ స్పూన్ పసుపు వేసి స్టవ్ మీదే కొద్ది సేపు ఉంచండి. చివర్లో కొత్తిమీర వేసి దించేయండి. అంతే, వేడి వేడి గోంగూర ఎండు చేపల కూర రెడీ

## బంగారం ధరలపై బిగ్ బాంబ్.. త్వరలో రూ.2 లక్షల మార్క్..? షాకింగ్ రీజన్ ఇదే..

స్టాక్ మార్కెట్ Stock Market



బంగారం ధరలపై పెద్ద షాకింగ్ న్యూస్ ఒకటి వెలువడింది. అదేంటంటే.. బంగారం ధరలు రూ.2 లక్షలకు చేరుకునే అవకాశం భవిష్యత్తులో ఉందంట. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న విషయం తెలిసిందే.

ఇరు దేశాల మధ్య శాంతికి చర్చలు జరుగుతున్నా.. ఇంకా చల్లబడటం లేదు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతున్నాయి. దీని ప్రభావంతో గత వారంలో బంగారం ధరలు పెరగ్గా.. ఈ వారంలో కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ఇదే కొనసాగితే బంగారం ధరలు రూ.2 లక్షల మార్క్‌కు చేరుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అంటున్నారు.

ఈ ఏడాదిలో రూ.2 లక్షల మార్క్..?

గత నెలలో గోల్డ్ రూ.1.90 లక్షల మార్క్‌కు చేరుకుని ఆల్ టైం రికార్డ్ నమోదు చేయగా.. ఆ తర్వాత దిగుతూ వచ్చాయి. ప్రస్తుతం రూ.1.60 లక్షల వద్ద ఊగిసలాడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే రానున్న కొద్ది నెలల్లో గోల్డ్ రేట్లు పెరగొచ్చని విశ్లేషిస్తున్నారు. ఇక ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లపై ఇంకా స్పష్టత రాలేదు. వడ్డీ రేట్లను తగ్గిస్తుందా.. లేదా పెంచుతుందా అనేది క్లారిటీ రాలేదు. చాలాకాలంగా దీని గురించి పెట్టుబడిదారులు ఎదురుచూస్తున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లలో కొత విధించవచ్చనే వస్తున్నాయి. ఇదే జరిగితే బంగారం ధరలు భగ్గుమంటాయి. ఎందుకంటే వడ్డీ తగ్గించడం వల్ల పెట్టుబడులపై వచ్చే ఆదాయం తగ్గుతుంది. దీని వల్ల బంగారంలో పెట్టుబడులు పెడతారు.

ఈ రెండే కీలకం

అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, వడ్డీ రేట్లలో కొత జరిగితే మాత్రం గోల్డ్ రేట్లు రూ.2 లక్షల మార్క్‌కు చేరుకునే అవకాశముందని చెబుతున్నారు. అయితే వీటికి సంబంధించి స్పష్టమైన నిర్ణయాలు వచ్చేంతవరకు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని అంటున్నారు. దీంతో బంగారం ధరలపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. 2025 నుంచి గోల్డ్, వెండి ధరలు పెరుగుతూ వస్తోన్నాయి. గత నెలలో జీవితకాలపు గరిష్ట స్థాయిని తాకగా.. ప్రస్తుతం నిలకడగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇంకెంత పెరుగుతాయనేది దానిపై పెట్టుబడిదారులు, సామాన్య ప్రజల్లో ఆసక్తి నెలకొంది. మరి నిజంగానే గోల్డ్ రూ.2 లక్షల మార్క్‌కు చేరుకుంటుందా.. లేక తగ్గుతుందా అనేది వేచి చూడాలి.

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్.. చర్చలు రీషెడ్యూల్..




భారత్, అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి చట్టబద్ధంగా తుది రూపును ఖరారు చేసేందుకు సోమవారం నుంచి ఇరు దేశాల అధికారుల మధ్య జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.
భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌కు సంబంధించి సోమవారం నుంచి మూడు రోజుల పాటు వాషింగ్టన్‌లో ఇరు దేశాల ప్రతినిధులు సమావేశం కావాల్సి ఉంది. అయితే అమెరికా సుప్రీం తీర్పు నేపథ్యంలో ఈ చర్చలు వాయిదా పడ్డాయి. ఇరు దేశాలకు అనుకూలమైన తేదీలలో చర్చలు తిరిగి నిర్వహించనున్నట్టు విదేశాంగ శాఖ పేర్కొంది. అయితే ఈ ప్రకటనను కేంద్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు .

చాలా ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు విధించిన సంగతి తెలిసిందే . భారత్ మీద కూడా 50 శాతం సుంకాలు విధించారు.

అయితే మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఆ సుంకాలు 50 నుంచి 18 శాతానికి తగ్గాయి. అమెరికా సుప్రీంకోర్టులో వ్యతిరేక తీర్పు రావడంతో ఆ సుంకాలు పది శాతానికి దిగి వచ్చాయి. కాగా, సుప్రీం తీర్పుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచదేశాలపై సుంకాలను పది శాతానికి తగ్గించిన ట్రంప్.. తాజాగా వాటిని 15 శాతానికి పెంచారు.

## ఎన్ఎండీసీ, వేల్ ఎస్ఏతో అదానీ గంగవరం పోర్ట్ ఒప్పందం



**హైదరాబాద్:** ప్రభుత్వ రంగానికి చెందిన ఎన్ఎండీసీ, బ్రెజిల్ కంపెనీ వేల్ ఎస్ఏతో అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్) లిమిటెడ్ అనుబంధ విభాగమైన అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ (ఏజీపీఎల్) వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఢిల్లీలో శనివారం జరిగిన ఇండియా-బ్రెజిల్ బిజినెస్ ఫోరమ్ సమ్మిట్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా, భారత వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఈ ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా మూడు సంస్థలు కలిసి ఆం్ర?ధప్రదేశ్‌లోని గంగవరం పోర్టులో ముడి ఇనుము (ఐరన్ ఓర్) బ్లెండింగ్ యూనిట్‌తో పాటు ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నాయి.

## బూత్ స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలి

### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, జూలై 4(సింగిడి):** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకశీటి చందర్ అన్నారు. శని వారం రామగుండం పట్టణంలోని 25, 26, 27, 28, 29, 30 డివిజన్ల బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హులైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం బూత్ లెవల్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మూల విజయరెడ్డి, కార్పొరేటర్ బాదావత్ నర్సమ్మ--సారయ్య నాయక్, మాజీ కార్పొరేటర్ నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు గతంలో ఉన్న రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలి

### కేంద్రానికి టీఎస్‌జేయూ వినతి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన రాష్ట్ర, జిల్లా నాయకులు



**కరీంనగర్, జులై4(సింగిడి):** జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న రైల్వే రాయితీ పాసుల సౌకర్యాన్ని పునరుద్ధరించి, దేశవ్యాప్తంగా అర్హులైన పాత్రికేయులకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు టీఎస్‌జేయూ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున వార్తల సేకరణ, ప్రజా సమస్యల పరిశీలన, అధికారిక కార్యక్రమాల కవరేజీ కోసం తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలో రైల్వే రాయితీ పాసులను తిరిగి అమలు చేస్తే పాత్రికేయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. ప్రతినిధి బృందంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పడకంటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గాండ్ల శేఖర్, నాయకుడు సుద్దాల భాస్కర్, కార్యవర్గ సభ్యుడు చింతం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కోరుకంటి చందర్



**గోదావరిఖని, జూలై 04 (సింగిడి):** గోదావరిఖని లక్ష్మీనగర్ షాపింగ్ ఏరియాలో షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.15 లక్షల నష్టపరిహారం అందించాలని, లక్ష్మీనగర్‌లోని అన్ని షాపులకు బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు షాపుల పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరారు.

## క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేయండి..

### - ఉదయ్‌ను కోరిన మున్సిపల్ కౌన్సిలర్ మాచర్ల రాజు

జమ్మికుంటలో ఉదయ్ నందన్ రెడ్డి ఆగడంతో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మాచర్ల రాజు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనతో సంభాషించారు. ఈ సందర్భంగా క్రీడల పట్ల మక్కువ ఉన్న ఉదయ్ నందన్ రెడ్డిని కలిసి జమ్మికుంటలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులతో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయాలని కోరగా కచ్చితంగా వర్షాకాలం అయిపోగానే ఏర్పాటు చేద్దామని దానికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక రాజకీయాల పై బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు తో చర్చించారు.





## ఉదయ్ నందన్ రెడ్డిని కలిసిన జర్నలిస్టులు..

యాప్ టీవీ సీఈవో ఉదయ్ నందన్ రెడ్డిని జమ్మికుంట పట్టణంలో స్థానిక పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. జమ్మికుంట ఐజేయు జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు నర్సిని శ్రీనివాస్ ఈనాడు దినపత్రిక రిపోర్టర్ భూపతి సంపత్ వెలుగు రిపోర్టర్ కొలకాని రాజు నినాదం హుజరాబాద్ ఆర్సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ వి6 పాత్రికేయులు దూలం అంజిబాబు తదితరులు కలిశారు.

# నిరుపేదల ఇంట "జ్ఞాన" ఉదయుడు

### సరస్వతీ పుత్రులకు నిస్వార్థ సేవకుడి అండదండలు

### జమ్మికుంటలో ఉదయ్ నందన్ రెడ్డికి అభిమానుల ఘనస్వాగతం

**జమ్మికుంట, జూలై 4 (సింగిడి):** నిస్వార్థ సేవకుడు, యప్ టీవీ అధినేత పాడి ఉదయ నందన్ రెడ్డికి ఆయన అభిమానులు జమ్మికుంట పట్టణంలో ఘనస్వాగతం పలికారు. తన స్వగ్రామం వీణవంక నుండి హైదరాబాద్ వెళుతున్న క్రమంలో జమ్మికుంట పట్టణంలోని స్థానిక డాల్ఫిన్ హోటల్ దగ్గర ఆయన కాసేపు అభిమానులతో ముచ్చటించారు. టీ తాగుతూ పలువురితో మాట్లాడారు. ఈ సందర్భంగా పాడి ఉదయ్ నందన్ రెడ్డిని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు ఘనంగా సన్మానించారు. లక్ష్మీ కటాక్షం లేని సరస్వతీ పుత్రులకు అండగా నిలుస్తున్న జ్ఞాన ఉదయుడు పాడి ఉదయ్ నందన్ రెడ్డి అని కొనియాడారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఉదయ్ నందన్ రెడ్డి నాయకులను ఆరా తీశారు. రానున్న రోజుల్లో జమ్మికుంట, ఇల్లందకుంట మండ లాలోని మోడల్ స్కూల్ లో విద్యార్థులకు అవసరమైన తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు. నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపేందుకుగాను పలువురు విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్షిప్లు అందజేస్తూ.. జ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్న ఉదయ్ రెడ్డి సేవలు నిస్వార్థమైనవని ఈ సందర్భంగా నేతలు తెలిపారు. స్థానిక టీ పాయింట్ వద్ద ఉదయ్ నందన్ రెడ్డితో ముచ్చటించేందుకుగాను యువకులు, నాయకులు వెల్లువెత్తారు.

## వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు 100 రోజుల ముందస్తు కార్యాచరణ

### మిల్లింగ్ వేగవంతం చేసి గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలి

### పౌరసరఫరాల శాఖ సంచాలకులు శ్యాం ప్రసాద్ లాల్



**కరీంనగర్, జులై4(నినాదం):** రానున్న వానాకాలం ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు 100 రోజుల ముందస్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు శ్యాం ప్రసాద్ లాల్ తెలిపారు. ఈ మేరకు కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత యాసంగి సీజన్‌లో అధికారులు, మిల్లర్ల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. రానున్న వానాకాలంలో సుమారు 80 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వంద శాతం ధాన్యం మిల్లింగ్ పూర్తి చేసి, కేంద్రానికి అప్పగించాల్సిన బియ్యం లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని ఆదేశించారు. అవసరమైతే మిల్లుల్లో పని వేళలను పెంచి మిల్లింగ్ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు. ప్రతి మిల్లుకు ఒక పర్యవేక్షణ అధికారిని నియమించి, పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో తరచూ తనిఖీలు నిర్వహిస్తూ మిల్లింగ్ పురోగతిని పర్యవేక్షించాలని శ్యాం ప్రసాద్ లాల్ ఆదేశించారు. సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా నిర్వాహకులు పాల్గొన్నారు.

## డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం ఆగదు



**గోదావరిఖని, జూలై 4,(సింగిడి):** మా న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం ఆగదు అని సి యం ఓ ఏ ఐ ఆర్జీ-1 ఉపాధ్యక్షులు పెరుమాళ్ల శ్రీనివాస్ అన్నారు. కోల్ ఇండియాతో సమానంగా పే అప్‌గ్రేడేషన్, మూడు సంవత్సరాల పీఆర్పీ బకాయిల విడుదల, ఇతర అలవెన్సుల అమలును కోరుతూ సి యం ఓ ఏ ఐ ఆధ్వర్యంలో ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఆర్జీ-1 ఏరియాకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆరే సీఎం కావాలి

### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని , జూలై 4(సింగిడి):** తెలంగాణలో మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని, గులాబీ జెండాపైనే ప్రజలకు విశ్వాసం ఉందని మాజీ ఎమ్మెల్యే, రామగుండం బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ కోరుకంటి చందర్ అన్నారు. శని వారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ చందర్ ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గంలోని 12, 13వ డివిజన్లకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన చందర్, కేసీఆర్ నాయకత్వంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే విఠల్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం పనిచేసిన కార్యకర్త మల్లేష్‌కు 15 రోజుల్లో ఉద్యోగం కల్పించాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, కార్పొరేటర్ చుక్కల శ్రీనివాస్‌ను డిమాండ్ చేశారు. లేకపోతే వారి ఇల్లు, ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మూల విజయరెడ్డి, బొడ్డు రవీంద్ర, రాకం వేణు, నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.



# ఇంధన భద్రతలో సింగరేణి కీలకం






### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**గోదావరిఖని, జూలై 04(సింగిడి):** దక్షిణ భారతదేశ ఇంధన భద్రతలో సింగరేణి మరింత కీలక పాత్ర పోషించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సూచించారు. రానున్న 10--15 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, కొత్త బొగ్గు బ్లాక్ల సాధన, కోల్ గ్యాసిఫికేషన్, ఉత్పత్తి పెంపు, రవాణా బలోపేతంపై దృష్టి సారించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సింగరేణి భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. రానున్న బొగ్గు గనుల వేలంలో చురుకుగా పాల్గొని కొత్త బ్లాక్లు సాధించాలని, కోల్ గ్యాసిఫికేషన్ రంగంలో అడుగులు వేయాలని సూచించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ పనితీరును మెరుగుపరచాలని, ఉద్యోగులకు సంస్థ వాస్తవ పరిస్థితులను పారదర్శకంగా వివరించాలని చెప్పారు. సంస్కరణల అమలుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, సంస్థ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో విద్యుత్ అవసరాలు పెరిగే అవకాశం ఉన్నందున బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ముందుగానే బలోపేతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి, కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ కస్సి, సింగరేణి డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు తెలంగాణే ఉత్తమ గమ్యం





### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### విక్టోరియా విప్ లీ టార్లామిస్‌తో మంత్రి కీలకభేటీ

### వాణిజ్య, సాంకేతిక సహకార విస్తరణపై ఇరువురి చర్చలు

### ద్వైపాక్షిక సహకారానికి సమగ్ర రోడ్‌మ్యాప్ సిద్ధం చేయనున్నట్లు లీ టార్లామిస్ వెల్లడి

**పెద్దపల్లి, జూలై 4: (సింగిడి):** పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా నిలిచిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం డా. బీఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విక్టోరియా (ఆస్ట్రేలియా) శాసనమండలి ప్రభుత్వ విప్ లీ టార్లామిస్‌తో జరిగిన భేటీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ--విక్టోరియా మధ్య వాణిజ్యం, సాంకేతికత, స్టార్టప్‌లు, విద్య, నైపుణ్యాభివృద్ధి, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇరువురు చర్చించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలతో రాష్ట్రం ముందంజలో ఉందని తెలిపారు. విక్టోరియా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆహ్వానించారు. విక్టోరియా ప్రభుత్వ విప్ లీ టార్లామిస్ మాట్లాడుతూ, తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేయడానికి తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని తెలిపారు. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూరే రంగాలను గుర్తించి సమగ్ర రోడ్‌మ్యాప్‌తో ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ పరిధుల్లో మార్పులు

### సీపీ అంబర్ కిశోర్ ఝా



**గోదావరిఖని,జూలై 04(సింగిడి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో గోదావరిఖని వన్ టౌన్, రామగుండం, బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తెలంగాణ ప్రభుత్వం మార్పులు చేసింది. ఈ మేరకు అధికారిక గెజిట్ ఉత్తర్వులు జారీ అయినట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జనగామ గ్రామం, సమ్మక్క--సారలమ్మ గద్దెలు, గోదావరి వంతెన, గంగానగర్ ప్రాంతాలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. అలాగే, పెద్దపల్లి సర్కిల్ పరిధిలో ఉన్న బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం సర్కిల్ పరిధిలోకి మార్చి గోదావరిఖని సబ్‌డివిజన్‌లో చేర్చారు. అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాపూర్, కుందన్‌పల్లి గ్రామాలను రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలోకి విలీనం చేశారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని సీపీ తెలిపారు.

## ఇసుక డంప్ వేలంపాట

### నాలుగు లక్షల ఒక వెయ్యి రూపాయలు

### టెండర్ దక్కించుకున్న నైనారి రమేష్



**జమ్మికుంట, జులై 4 (సింగిడి) :** జమ్మికుంట మండలంలోని శంభునిపల్లి గ్రామంలో ఇటీవల అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపును పోలీసులు స్వాధీనం చేసుకొని జమ్మికుంట రెవెన్యూ అధికారులకు అప్పగించారు. పోలీసులు అప్పగించిన ఇసుక డంపును శనివారం అధికారులు వేలంపాట నిర్వహించగా నలుగురు వ్యక్తులు పాల్గొన్నారు. శంభుని పల్లి గ్రామానికి చెందిన నైనారి రమేష్ నాలుగు లక్షల ఒక వెయ్యి రూపాయలకు వేలం పాటలో ఇసుక డంపు దక్కించుకున్నారు. ఈ టెండర్ జమ్మికుంట తహసిల్దార్ గడ్డం సుధాకర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు గడ్డం శంకర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాజకిరణ్ శ్రవణ్ హరీష్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కుటుంబం నుంచి ఉస్మానియాలో పీహెచ్‌డీ వరకు..

### కష్టాలను జయించి కంప్యూటర్ శాస్త్రంలో ఉన్నత పరిశోధన పూర్తి చేసిన కిష్టాపూర్ యువకుడు

**కరీంనగర్, జులై4(సింగిడి):** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన కడపల అంజయ్య వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించి, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సవాళ్లను అధిగమించి ఉన్నత విద్యలో అరుదైన విజయాన్ని సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కంప్యూటర్ శాస్త్రం, ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందారు. ఉపగ్రహ వైమానిక చిత్రాల ఆధారంగా న్యూరల్ నెట్‌వర్క్‌లతో బహుళ లేబుల్ వర్గీకరణ ద్వారా వస్తువుల గుర్తింపు అనే అంశంపై డాక్టర్ కె. సాగర్ పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా అంజయ్యకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, విద్యావేత్తలు అభినందనలు తెలియజేశారు.



# నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధిని..
# పెంపొందించుకోవాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 04(సింగిడి):** నిరుద్యోగ యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే జనరల్ సత్యనారాయణరావు అన్నారు. సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో భూపాలపల్లి పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన డ్రోన్ టెక్నీషియన్ కోర్సు ముగింపు, సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం సింగరేణి జిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ సాధారణంగా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి ఈ డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ పొందాలంటే 50 వేల వరకు ఖర్చవుతుందని, అలాంటి ఖరీదైన కోర్సును మన భూపాలపల్లి ప్రాంత నిరుద్యోగ యువతకు ఇక్కడే ఉచితంగా అందించడం అభినందనీయం అన్నారు. సింగరేణి, టాస్క్ ద్వారా ప్రభుత్వం తరపున స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించి, మొదటి విడతగా 24 మంది నిరుద్యోగ యువతకు డ్రోన్ టెక్నాలజీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసి




సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. ?యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి చెడు మార్గాల వైపు మళ్లకుండా, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా శిక్షణ పొంది సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా సుమారు 10 వేల మంది నిరుద్యోగులు హాజరుకాగా, అందులో 2,700 మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించామని అన్నారు. త్వరలోనే మరిన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో మరోసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు అత్యాధునిక సాంకేతిక రంగాలలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని తెలిపారు.

ప్రస్తుత ఆధునిక వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం ఎంతో పెరిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు నాబార్డ్ ద్వారా సబ్సిడీపై రైతులకు, ఐకేపీ, డ్వాక్రా మహిళా సంఘాలకు ఈ డ్రోన్‌లను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సబ్సిడీ డ్రోన్ల ఎంపికలో ప్రాధాన్యత ఇస్తూ, వారు రైతులకు మందుల పిచికారీ వంటి పనుల్లో సహాయపడుతూ ఉపాధి పొందేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ కేంద్రాల్లో లభించే 38 రకాల విభిన్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు కేవలం రెండు కోర్సులకు మాత్రమే ఆసక్తి చూపుతున్నారని, మిగిలిన కోర్సులపై విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని కోరారు.

సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహించిన 2 వారాల ప్రత్యేక డ్రోన్ టెక్నీషియన్ కోర్సు నిర్వహించడం పట్ల అభినందించారు. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ అనేది ఎంతో వేగంగా విస్తరిస్తున్న అధునాతన రంగమని పేర్కొన్నారు. గత ఏడాది నాబార్డ్ సంస్థ ద్వారా భూపాలపల్లి జిల్లాలో అర్హులైన యువతకు డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వడానికి ఒక సమగ్ర కార్యాచరణ నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యం జరిగిందని ?యువతకు ఈ అవకాశాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సింగరేణి సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా ఈ ప్రత్యేక డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం యువతకు శిక్షణ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్రా కొమురయ్య , వైస్ చైర్‌పర్సన్ అంబాల శ్రీనివాస్, జిల్లా, నాబార్డు అధికారులు, సింగరేణి అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# సింగారం హత్య కేసు నిందితుల అరెస్ట్



**మహబూబాబాద్, జులై 04 (సింగిడి):** మహబూబాబాద్ మండలం సింగారం గ్రామం లో ఈ నెల 1వ తేదీ తెల్లవారు జామున మాజీ ఉప సర్పంచ్ యాకయ్య (57)ని హత్య చేసిన 7 గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన మీడియా సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ శబరిష్.
వివాహేతర సంబంధం , ఆస్తి గొడవలే హత్యకు కారణం.

**యాకయ్యకు గ్రామంలో మరో మహిళతో వివాహేతర సంబంధం..**

ఆస్తిని ఆ మహిళకు రాసిస్తాడనే భయంతో భర్త ను హత్య చేసేందుకు 4 లక్షల రూపాయల సుఫారీ మాట్లాడిన భార్య యశోద ( 53 ).యాకయ్య ను ఇనుప రాడ్ తో కొట్టి హత్య చేసి మృతుని మెడ లోని బంగారు గొలుసు ను తీసుకొని పరారైన దుండగులు. భార్య యశోధ మరో 6 రు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలింపు. 7 సెల్ ఫోన్లు , ఐరన్ రాడ్ , 2 ద్విచక్ర వాహనాలు , 1 బంగారు గొలుసు సీజ్ చేసిన పోలీసులు. ఈ హత్య కేసును తక్కువ సమయంలోనే ఛేదించి నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ తిరుపతి రావు,రూరల్ సీఐ అంజలి, ఎస్ఐ రాజు, సతీష్, రవికిరణ్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# దశదినకర్మలకు హెల్పింగ్ హ్యాండ్ ఆర్థిక సహాయం



**ములుగు, జులై 4 (సింగిడి) :** మంగపేట మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన సిలువేరు భద్రయ్య ఇటీవల అనారోగ్యం వలన మృతిచెందగా విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్ కమ్యూనిటీ వారు దాతల సహాయంతో పేద కుటుంబంలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న భద్రయ్య కుటుంబానికి దశదినకర్మలకు ఒక రైస్ బ్యాగు మరియు నిత్యవసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అభిషేక్, గంధసిరి ఉపేందర్ భరపటి యేసు బాబు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి అండగా నిలిచిన భూక్య జంపన్న

### ఎటువంటి ఫీజు చెల్లించకుండా సర్టిఫికెట్లు ఇప్పించిన బిఆర్ఎస్ లీడర్



**ములుగు ప్రతినిధి, జూలై 4 (సింగిడి) :** పై చదువులు కొనసాగించాలనే ఆశతో ఉన్న ఓ పేద విద్యార్థినికి బి ఆర్ ఎస్ ములుగు జిల్లా నాయకుడు భూక్య జంపన్న అండగా నిలిచారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేసిన రూ.4 లక్షల ఫీజు చెల్లించకుండానే విద్యార్థిని సర్టిఫికెట్లు ఇప్పించి మానవత్వం చాటుకున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన కొండగోర్ల రవలి ఖమ్మం జిల్లాలోని ఓ ప్రైవేట్ కాలేజీలో చదివింది. పై చదువుల కోసం సర్టిఫికెట్లు కావాలని కాలేజీ యాజమాన్యాన్ని కోరగా, రూ.4 లక్షల ఫీజు చెల్లిస్తేనే ఇస్తామని షరతు విధించారు. గత రెండేళ్లుగా కాలేజీ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విద్యార్థిని భూక్య జంపన్న కార్యాలయాన్ని ఆశ్రయించింది. సమస్య విన్న వెంటనే స్పందించిన భూక్య జంపన్న కాలేజీ యాజమాన్యంతో స్వయంగా మాట్లాడారు. ములుగు నుంచి తన ప్రతినిధులను, ఖమ్మంలోని మిత్రులను పంపించి చర్చలు జరిపించారు. వారి ప్రయత్నాల ఫలితంగా విద్యార్థిని ఒక్క రూపాయి చెల్లించకుండానే సర్టిఫికెట్లను పొందగలిగింది.

# దోపిడీ, హత్యాయత్నం చేసిన యువకుడు అరెస్ట్

### ఆన్‌లైన్ జూదం వ్యసనంతో మహిళ కిడ్నాప్

### సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన కరీంనగర్ పోలీసులు

### నిందితుడి నుంచి నగలు, నగదు, వాహనం స్వాధీనం

**కరీంనగర్, జూలై 4(సింగిడి):** ఆన్‌లైన్ జూదంలో భారీగా డబ్బు కోల్పోయి అప్పుల ఒత్తిడితో మహిళను కిడ్నాప్ చేసి, ఆమెపై దాడి చేసి నగలు దోచుకుని హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూలై 1న ఉదయం టవర్ సర్కిల్ సమీపంలోని కూలీల అడ్డా వద్ద పనికోసం వేచి ఉన్న గంగాధర లక్ష్మి (55) అదృశ్యమవడంతో తొలుత కరీంనగర్ మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కనిపించకుండా పోయిన కేసు నమోదు చేశారు. దర్యాప్తులో ఇది కిడ్నాప్, దోపిడీ, హత్యాయత్నం కేసుగా తేలడంతో విచారణను మొదటి పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.విచారణలో గొల్లపల్లి గ్రామానికి చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ధమ్మ దినేష్ రెడ్డి (21) నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. అతడు డీయూవిన్, జియో లాటరీ వంటి ఆన్‌లైన్ జూదం, రంగుల వ్యాపార ఆటలకు బానిసై సుమారు రూ.4 లక్షలు నష్టపోయాడు. అప్పుల ఒత్తిడి నుంచి బయటపడేందుకు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ నేరానికి పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు.నేరానికి వారం రోజుల ముందే పలు ప్రాంతాల్లో పరిశీలన నిర్వహించిన నిందితుడు, బాధితురాలిని ద్విచక్ర వాహనంపై తిమ్మాపూర్ వైపు తీసుకెళ్లి, నుస్తులాపూర్ శివారులోని పొలాల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై దాడి చేసి సుమారు ఐదు గ్రాముల బంగారు ఆభరణాలు, 20 గ్రాముల వెండి మట్టెలను దోచుకున్నాడు.ఆ తర్వాత తన నేరాన్ని దాచిపెట్టేందుకు బాధితురాలిని వ్యవసాయ బావిలోకి తోసివేశాడు. ఆమె తాడును పట్టుకుని ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించగా, గుర్తించే అవకాశం లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఆ తాడును కూడా కత్తిరించి పరారయ్యాడు. అయితే బాధితురాలికి ఈత రావడంతో బావిలోని మరో తాడును పట్టుకుని రాత్రంతా అక్కడే గడిపింది. మరుసటి ఉదయం రైతులు ఆమె కేకలు విని బయటకు తీసి ప్రభుత్వ




ఆసుపత్రికి తరలించారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా దృశ్యాలు, సెల్‌ఫోన్ విశ్లేషణ తదితర వివరాల ఆధారంగా నిందితుడిని మార్కెట్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, రూ.5 వేల నగదు, వెండి మట్టెలను స్వాధీనం చేసుకున్నారు. దోచుకున్న బంగారు ఆభరణాలను టవర్ సర్కిల్‌లోని ఓ నగల వ్యాపారికి విక్రయించినట్లు తేలడంతో వాటిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో మిగిలిన ఆధారాల సేకరణ పూర్తి చేసి త్వరలోనే అభియోగపత్రం దాఖలు చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ ఆన్‌లైన్ జూదం, అక్రమ బెట్టింగ్ యాప్‌లు ఆర్థిక, మానసిక నష్టాలతో పాటు తీవ్రమైన నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అలాగే కూలీలు అపరిచితులను నమ్మి ఒంటరిగా వెళ్లకుండా, పనికి వెళ్లే ముందు సంబంధిత వ్యక్తుల వివరాలు, వాహన నంబరు, గమ్యస్థానాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసును సాంకేతిక ఆధారాలతో వేగంగా ఛేదించిన సహాయ పోలీసు కమిషనర్ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు కె. రామచందర్ రావు, తిరుమల్, ఉప ఇన్‌స్పెక్టర్లు సుమన్, చేరాలు, భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్, కానిస్టేబుళ్లు లక్ష్మిపతి, రాజ్‌కుమార్, ప్రశాంత్‌లను పోలీసు కమిషనర్ అభినందించారు.

# ములుగు జిల్లా ప్రజలకు పోలీసు శాఖ హెచ్చరిక

### వచ్చే 3 రోజులు భారీ వర్షాలు

### అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి



**ములుగు ప్రతినిధి, జూలై 4 (సింగిడి):** రానున్న 3 రోజుల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలంగాణ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ములుగు జిల్లాలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. వర్షాల వల్ల సంభవించే ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడిసిన కరెంటు స్తంభాలను అస్సలు ముట్టుకోవద్దు. పాత మరియు శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివాసం ఉండరాదు, అత్యవసర పరిస్థితులు తప్ప బయటికి రావద్దు, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దు,వర్షాకాలంలో రోడ్లు జారుడుగా ఉంటాయి,అవసరానికి మించి వేగంగా వాహనాలు నడపరాదు. పై జాగ్రత్తలు అందరూ తప్పనిసరిగా పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని ములుగు జిల్లా పోలీసులు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవు





### యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

### అవగాహన సదస్సులో ఏసిపి మాధవి

**జమ్మికుంట, జులై 4 (సింగిడి) :** జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తో కలిసి గ్రామస్తులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద గ్రామస్తులతో వారు సమావేశం నిర్వహించి గ్రామస్తులకు గ్రామంలోని పలువురు యువతీ యువకులకు డ్రగ్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ అలం ఆదేశాల మేరకు మానేరు పరివాహక ప్రాంతమైన విలాసాగర్ గ్రామం నుండి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని ఇకపై ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అంతేకాకుండా నేటి యువత గుట్కా పాన్ గుడుంబా గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని అది మంచి పద్ధతి కాదని వారు తెలిపారు. మీ బంగారు భవిష్యత్తు బాగుండాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మిమ్మల్ని కన్నా మీ తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకొని ఉజ్వల భవిష్యత్తు కొరకు మంచిగా చదువుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని వారు గ్రామస్తులకు తెలిపారు. సోషల్ మీడియా గ్రూపులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు పెట్టిన అనవసరమైన పోస్టులు పోస్ట్ చేసిన గ్రూప్ అడ్మిన్ తోపాటు పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని వారు గ్రామస్తులను హెచ్చరించారు.

**ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం..**

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే సీసీ కెమెరాలు ద్వారా నేరస్తులను త్వరగా గుర్తించవచ్చునని నేరాల నియంత్రణ తగ్గుతుందని ఏసిపి గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో వీలైనంతవరకు సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని ఇది అందరికీ మంచిదని ఆమె పేర్కొన్నారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని అక్రమ ఇసుక రవాణా చేయమని గ్రామస్తుల చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు ట్రాక్టర్ల యజమానులు డ్రైవర్లు యువతీ యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో

# అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన శ్రేయస్ రెడ్డి

**కరీంనగర్, జులై4(సింగిడి):** కరీంనగర్‌కు చెందిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుమారుడు వి. శ్రేయస్ రెడ్డి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన సందర్భంగా శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన నివాసానికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర శ్రమతో విద్యార్థులు ఉన్నత విజయాలను అందుకోవచ్చని అన్నారు. చిన్నప్పటి నుంచే పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే దేశంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో ప్రవేశం పొందే అవకాశాలు మెరుగుపడటంతో పాటు



ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడతాయని పేర్కొన్నారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్య అందించడం వల్ల విద్యార్థులు తమ లక్ష్యాలను సులభంగా చేరుకోగలుగుతున్నారని తెలిపారు. అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన తన కుమారుడు వి. శ్రేయస్ రెడ్డి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబర్చి భారతీయ సమాచార సాంకేతిక సంస్థ, బెంగళూరులో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, భారతీయ సాంకేతిక విద్యాసంస్థ, ముంబైలో కెమికల్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందడం గర్వకారణమని అన్నారు. అలాగే బిట్స్ పిలానీలో కూడా అదే విజయ పరంపర కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నరహరి, డాక్టర్ కెప్టెన్ మధుసూదన్ రెడ్డి, కన్న కృష్ణ, డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమరవెల్లి వెంకటేశం పాల్గొన్నారు. శ్రేయస్ విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, వనజా నరేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

# నిస్వార్థ రాజకీయ నాయకుడు మాజీ సీఎం రోశయ్య

### మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

### ఘనంగా " కొణిజేటి" జయంతి కార్యక్రమం

**జమ్మికుంట, జూలై 4 (సింగిడి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కర్ణాటక తమిళనాడు మాజీ గవర్నర్ కొనజేటి రోశయ్య జయంతి వేడుకను మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన గొప్ప రాజకీయ ఆర్థిక నిపుణుడు రోశయ్య అని కొనియాడారు. ఆర్థిక శాఖ మంత్రిగా విశిష్ట సేవలు అందించిన రోశయ్య తనదైన శైలిలో బడ్జెట్ రూపకల్పన చేసి 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన గణత ఆయనకే దక్కుతుందని గుర్తు చేశారు. మచ్చలేని రాజకీయ నేతగా ప్రతిపక్ష నేతల తో కూడా ప్రశంసలు అందుకున్న గొప్ప ఆర్థిక నిపుణుడు రోశయ్య అని కొనియాడారు. ఆర్యవైశ్య ముద్దుబిడ్డగా పేరుపొందిన మాజీ



ముఖ్యమంత్రి రోశయ్య ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారని అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమని వారి జయంతి వేడుకను నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చందా రాజు దిడ్డి రామ్మోహన్ ఏగీత అశోక్ యాట్ల సునీత అశోక్ గుర్రం కావ్య పరశురాం గౌడ్ పొన్నగంటి విష్ణు కొలుగూరి సురేష్ లక్ష్మణ్ మంద రాజేష్ ఒగ్గు రమేష్ తో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం



**జవహర్ నగర్, జులై 4 (సింగిడి):** సీఎం సహాయనిది పేదలకు ఎంతో మేలు చేస్తుందని, అది పేదలకు గొప్ప వరమని జవహర్ నగర్ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు సుధాకర్ చారి అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ కు చెందిన సురుగు చిన్న మారయ్య ఇటీవల అనారోగ్యానికి గురవ్వగా... సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. 27,500 చెక్కును శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ చారి మాట్లాడుతూ సీఎం సహాయనిది పేదలకు వరం లాంటిదని జవహర్ నగర్ లో గరీబోల్లే ఎక్కువగా నివసిస్తున్నారని వారికి ముఖ్యంగా ఈ సీఎం సహాయనిది ఎంతగానో మేలు చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లస్వామి, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు

# ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కార్యనిర్వాహక కమిటీ

### సమగ్ర ఓటరు సవరణకు జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు

### బూత్ స్థాయి ప్రతినిధులకు న్యాయ, సాంకేతిక సహాయానికి ప్రత్యేక ఏర్పాట్లు

### డా. మేడిపల్లి సత్యం చైర్మన్‌గా, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి సభ్యుడిగా నియామకం

**కరీంనగర్, జూలై4(సింగిడి):** సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యంను చైర్మన్‌గా నియమించారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ నిర్మాణం, స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డిని సభ్యుడిగా నియమించారు.



అలాగే, ఓటరు సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి ప్రతినిధులకు ఎదురయ్యే న్యాయ, సాంకేతిక సమస్యలకు మార్గనిర్దేశం చేసేందుకు సీనియర్ న్యాయవాది తునికి పవన్ కుమార్‌ను న్యాయ సలహాదారుగా నియమించారు.జిల్లాలోని బూత్ స్థాయి ప్రతినిధులు మండల, నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ కమిటీ అవసరమైన సహకారం అందిస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకత్వం తెలిపింది.నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు, ఓటరు జాబితాలో అవకతవకలకు అవకాశం లేకుండా అవసరమైన న్యాయ, పరిపాలనా సహాయాన్ని అందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతగా పేర్కొంది.

# ఎడిటోరియల్

Editorial

## నిస్తేజ నవ భారతం.. పాలకుల నిర్లక్ష్యానికి ఇది సజీవ సాక్ష్యం!

ప్రపంచ యవనికపై భారతదేశం అగ్రగామిగా వెలుగుతోందని, ఆర్థిక వ్యవస్థలో దూసుకుపోతోందని పాలకులు ఊదరగొడుతున్న ప్రగల్భాల వెనుక ఒక భయంకరమైన నిశీధి దాగి ఉంది. అది 'నెత్తురు లేని భారతం'. దేశ భవిష్యత్తుకు వారసులవ్వాల్సిన కోట్లాది మంది చిన్నారులు, మాతృ మూర్తుల నరాల్లో రక్తం ఉరకలేయాల్సింది పోయి, రక్తహీనతతో వెలవెల బోతుండటం చూస్తుంటే మనం అభివృద్ధి చెందుతున్నామా లేక అధోగతికి చేరుతున్నామా అన్న సందేహం కలగక మానదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడించిన గణాంకాలు కేవలం అంకెలు కావు, అవి మన దేశ ఆరోగ్య వ్యవస్థ వైఫల్యానికి పదునైన అక్షర రూపులు. సగానికి పైగా మహిళలు, మెజారిటీ చిన్నారులు రక్తహీనతతో కునారిల్లుతున్నారంటే, అది వ్యవస్థల అసమర్థతకు పరాకాష్ట. ఈ నిస్సత్తువ వెనుక పాలకుల నిర్లక్ష్యం, అధికార యంత్రాంగపు వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

**అభివృద్ధి ఆడంబరం.. ఆకలి భయంకరం**

మనం ఉపగ్రహాలను నింగిలోకి పంపిస్తున్నాం, అతివేగ ప్రయాణ సాధనాల గురించి కలలు కంటున్నాం. కానీ, ఈ దేశంలోని సగటు పేదవాడి కంచం లో నేటికీ పోషకాహారం ఒక కలగానే మిగిలిపోయింది. రక్తహీనత అనేది కేవలం ఒక ఆరోగ్య సమస్య కాదు, అది ఒక నిశ్శబ్ద హంతకి. శరీరంలో రక్తం తగ్గి, నిస్సత్తువ ఆవహించి, బతకలేక బతుకుతున్న కోట్లాది మంది తల్లుల ఆక్రందన ఈ సమాజానికి వినిపించడం లేదా? గర్భం దాల్చిన తల్లి రక్తహీనతతో ఉంటే, పుట్టబోయే బిడ్డ మేధస్సు ఎలా ఉంటుంది? రేపటి తరం మేధోహీనులుగా, బలహీనులుగా మారితే మనం ఏ 'విశ్వగురువు' పదవి కోసం పాకులాడుతున్నాం? పోషకాహార భద్రత కల్పించలేని రాజ్యాలు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టి ఆడంబరాలు చేసినా అవి వృథా ప్రయాసలే అవుతాయి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి నిర్మించే ఏ సామ్రాజ్యమైనా పేకమేడలా కూలిపోక తప్పదు.

**విషవలయంలో బాల్యం – భవిష్యత్తుపై గొడ్డలి పెట్టు**

చిన్నారుల్లో రక్తహీనత పెరగడం అంటే దేశపు పునాదులనే కూల్చి వేయ డమే. ఐదేళ్లలోపు చిన్నారుల్లో ఈ సమస్య అధికమవ్వడం వెనుక ఉన్నది కేవలం అనారోగ్యం కాదు, అది పాలకుల అపసవ్య విధానాల ఫలితం. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తల వ్యవస్థను బలోపేతం చేయ కుండా, వారికి కనీస గౌరవం ఇవ్వకుండా, కాగితాల మీద లెక్కలు చూ పించి 'అంతా బాగుంది' అని భ్రమపడటం ఆత్మవంచన అవుతుంది. నులి పురుగుల నివారణ నుంచి సరైన సమతుల్య ఆహారం అందించే వరకు ప్రతి దశలోనూ నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. పిల్లల పొట్ట కొట్టి, వారి ఆరో గ్యాన్ని పణంగా పెట్టి సంపాదించే లాభాలు ఏ దేశాన్నీ ఉద్ధరించవు. బడిలో పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యతను గాలికి వదిలేసి, స్వార్థపరుల జేబులు నింపే సంస్కృతి నశించినప్పుడే ఈ దేశానికి పట్టిన పీడ విరగడవు తుంది. బక్కచిక్కిన శరీరాలతో, జీవం లేని కళ్లతో పాఠశాలలకు వచ్చే చిన్నారులు ఈదేశపు భవిష్యత్తుకు సంకేతాలా? అనిపాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి.

**సామాజిక బాధ్యతారాహిత్యం – విచక్షణ లేని జీవనశైలి**

రక్తహీనత అంటే కేవలం పేదరికానికి ప్రతిరూపం అనుకుంటే పొరపాటే. ఇది సంపన్న వర్గాల్లో కూడా వేళ్లూనుకుంది. విదేశీ ఆహారపు అలవాట్లకు బానిసలై, ఆకర్షణీయమైన ప్రకటనల మాయాజాలంలో చిక్కుకుని, మన నేల మీద దొరికే సహజ సిద్ధమైన పోషకాహారాన్ని విస్మరించడం వల్ల కలిగే నష్టం తక్కువేమీ కాదు. ఒకవైపు పేదరికం వల్ల రక్తం లేక చస్తుంటే, మరోవైపు అవగాహన లేక అనారోగ్యకరమైన ఆహారం తింటూ బలహీనప డుతున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్య కాదు, ఇదొక నైతిక పతనం. ప్రకటనల్లో కనిపించే రంగుల ఆహారం వెనుక ఉన్న అసలు సత్యాన్ని గ్రహించలేకపోవడం మన విజ్ఞతకే సవాల్. ప్రభుత్వాలు పంపిణీ చేసే ఔషధాలను వాడకుండా పక్కన పడేసే మూఢత్వం, అపోహలు సామాజిక అభివృద్ధికి ఆటంకాలుగా మారుతున్నాయి. సమాజంలోని మేధావి వర్గం ఈ దిశగా ప్రజలను చైతన్యపరచడంలో విఫలమవుతోంది.

**నినాదాల మోత.. క్షేత్రస్థాయిలో శూన్యం**

ప్రభుత్వాలు ఇచ్చే భారీ నినాదాలు వినడానికి ఇంపుగా ఉంటాయి కానీ, వాస్తవ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. పంపిణీ చేస్తున్న పోషక ఔష ధాలు నాసిరకంగా ఉండటం, అవి ప్రజలకు సకాలంలో అందకపోవడం వంటి సమస్యలు కోకొల్లలు. బలవర్ధకమైన ఆహార పదార్థాల పంపిణీ పేరుతో చేస్తున్న ప్రయోగాలు ఎంతవరకు సఫలం అవుతున్నాయో పర్య వేక్షించే నాథుడే లేడు. కేవలం నిధుల కేటాయింపులు చూపించి చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రతి గ్రామంలో, ప్రతి గడపలో రక్తహీనత ఉన్న వ్యక్తిని గుర్తించి, వారికి తగిన చికిత్స అందించే బాధ్యతను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. ఇది రాజకీయ లబ్ధి కోసం చేసే పని కాకూడదు, ఇది ఒక జాతీయ కర్తవ్యం కావాలి. పాలకుల ప్రాధాన్యతలు కేవలం ఎన్నికల చుట్టూ కాకుండా, పౌరుల ఆరోగ్యం చుట్టూ తిరగాలి.

**మేల్కొనాల్సిన సమయం -- నెత్తురు మరగాలి!**

రక్తహీనత లేని సమాజం కోసం పౌర సమాజం గొంతు ఎత్తాలి. మనం తింటున్న ఆహారం మనల్ని బ్రతికిస్తోందా లేక నెమ్మదిగా చంపుతోందా అని ప్రశ్నించుకోవాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. మన పిల్లల కళ్లు నిస్తేజంగా మారుతుంటే, వారి ఎదుగుదల కుంటుపడుతుంటే చూస్తూ ఊరుకోవడం నేరం. సంపూర్ణ ఆరోగ్యం కలిగిన మాతా శిశువులే రేపటి శక్తివంతమైన భారతావనికి ప్రతినిధులు. నినాదాల హోరు తగ్గాలి, నిజమైన నెత్తురు ఉరకలెత్తాలి. రక్తం లేని భారతం ప్రపంచానికి ఏ సందేశం ఇవ్వగలదు? ఈ దుస్థితి మారకపోతే రేపటి తరాలు మృతప్రాయంగా మిగిలిపోతాయి. పాలకులారా.. ఇకనైనా మీ నిద్ర వీడి, ఈ దేశపు నరాల్లో రక్తాన్ని నింపే పని మొదలుపెట్టండి. లేదంటే రాబోయే తరాలు మిమ్మల్ని చరిత్ర హీనులుగా చూస్తాయి తప్ప క్షమించవు.

**వెంక గారి భూమయ్య,**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

# పద కవితా పితామహుడు అన్నమాచార్యుడు



దక్షిణా పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు, తెలుగు సాహితీ చరిత్రలో ప్రథమ వాగ్గేయ కారుడు అన్నమాచార్యుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచు కున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆశుకవితా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణుల నమ్మకం.



అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదీకులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్ఛ స్థితిలో ఉండగా, నారాయణ సూరి – లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడం లో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతా గ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టా డు. సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకు న్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగు లోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్న మయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ధి కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపాయే, కొండలలో నెలకొన్న, మూసిన ముత్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి. "సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహుడు", "పంచమాగమ సార్వభౌముడు", "ద్రావిడ ఆగమ సార్వభౌముడు"అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వాఙ్మయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు.

**– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



# నీటికి జ్ఞాపకశక్తి ఉందా?

భూ ప్రపంచంపై జీవం పుట్టడానికి కారణమైన నీరు కేవ లం ప్రాణవాయువు సహా జలజని పరమాణువుల కలయిక మాత్రమే కాదు అది ఒక సజీవ సమాచార భాండాగారం అని ఆధునిక పరిశోధనలు ఘోషిస్తున్నాయి. నీటికి జ్ఞాపకశక్తి ఉం టుందనే వాదన దశాబ్దాలుగా విజ్ఞాన శాస్త్ర ప్రపంచంలో ఒక పెను సంచలనంగా మారింది. మనం మాట్లాడే మాటలు తో పాటు మన ఆలోచనలు అలాగే మన చుట్టూ ఉండే తరంగాలు నీటి అంతర్గత నిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయని పలు దేశాల శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా నిరూపించారు. కేవలం భౌతిక ద్రవంగా పరిగణించబడే నీరు తన స్పర్శలోకి వచ్చే ప్రతి వస్తువు యొక్క ప్రకంపనలను నమోదు చేసుకోగలదు. ఆ సమాచారాన్ని భవిష్యత్తుకు మోసుకెళ్లగలదని వాస్తవాలు వెల్లడిస్తున్నాయి. ఈ వింత ధర్మాన్ని అర్థం చేసుకుంటే మన శరీరంలో 70 శాతం ఉండే నీరు మన మనస్తత్వాన్ని ఎలా మార్చగలదో అర్థమవు తుంది. రసాయన శాస్త్ర పరిధిని దాటి నీటిని ఒక ద్రవ రూప స్మృతి చిహ్నంగా చూడాల్సిన సమయం ఆసన్నమైందని అంత ర్జాతీయ వేదికలపై మేధావులు చర్చ మొదలుపెట్టారు.

**ఫ్రెంచ్ శాస్త్రవేత్త ప్రకంపనలు:**

నీటికి జ్ఞాపకశక్తి ఉంటుందనే వాదనకు ఆధునిక శాస్త్రీయ పునాది వేసింది ఫ్రాన్స్ దేశపు రోగనిరోధక శాస్త్రవేత్త జాక్వెస్ బెన్వెనిస్టే. 1988 జూన్ 30న ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రీయ పత్రిక ప్రకృతిలో ఆయన ప్రచురించిన పరిశోధనా వ్యాసం వైద్య ప్రపం చాన్ని కుదిపేసింది. హోమియోపతి మందులలో రసాయన మూ లకం లేకపోయినా ఆ మందు నీటిలో కలిసినప్పుడు ఆ మూలకం యొక్క నీడ ముద్ర నీటిలో అలాగే ఉంటుందని ఆయన నిరూపించారు. ఆ నీరు తనతో కలిసిన ఔషధం యొక్క శక్తిని గుర్తుంచుకుని శరీరంలో ప్రతిచర్యను చూపిస్తుందని ఆయన ప్రయోగశాల సాక్షిగా వెల్లడించారు. ఆ ప్రయోగం ఆనాడు తీవ్ర విమర్శలకు గురైనప్పటికీ నీటి అణువుల అమరికలో సమాచారం నిక్షిప్తమవుతుందనే ఆలోచనకు మొదటి బీజం వేసింది. ఫ్రాన్స్ దేశపు ప్రతిష్టాత్మక ఆరోగ్య పరిశోధనా సంస్థలో జరిగిన అధ్య యనం నీరు కేవలం వాహకం కాదు అది ఒక సందేశకర్త అని చాటిచెప్పింది. శాస్త్రవేత్తలు మొదట తిరస్కరించినా కాలక్రమేణా నీటి భౌతిక ధర్మాలలో మార్పులను గమనించక తప్పలేదు.

**భావోద్వేగాల దర్పణం నీరు**

నీటి జ్ఞాపకశక్తిపై దృశ్యరూప ఆధారాలను అందించిన వ్యక్తి జపాన్ దేశపు డాక్టర్ మసారు ఎమోటో. 1990వ దశకంలో ఆయన నిర్వహించిన ప్రయోగాలు నీటిపై మన ఆలోచనల ప్రభా వం ఎలా ఉంటుందో స్పష్టంగా చూపించాయి. నీటిని వేర్వేరు భావోద్వేగాలకు అంటే ప్రేమ తోపాటు ద్వేషం అలాగే శాంతి వంటి వాటికి గురిచేసి ఆ తర్వాత ఆ నీటిని మంచులా గడ్డక ట్టించి సూక్ష్మదర్శిని కెమెరాలతో చిత్రాలు తీశారు. ప్రేమ వంటి సానుకూల పదాలు విన్న నీరు అద్భుతమైన 6 కోణాల ఆకారపు స్ఫటికాలుగా మారింది. ద్వేషం వంటి ప్రతికూల పదాలు విన్న నీరు చిందరవందరగా అలాగే అసహ్యకరంగా మారడం గమనించారు. జర్మనీలోని స్టట్‌గార్ట్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కూడా ఇదే విధమైన ఫలితాలను పొందారు. ఒకే నీటి పాత్రలో వేర్వేరు విద్యార్థులతో నీటి చుక్కలను వేయించి వాటిని పరిశీ లించినప్పుడు ఒక్కో విద్యార్థి వేసిన చుక్కలు ఒకే రకమైన ఆకృ తిని ప్రదర్శించడం చూసి వారు ఆశ్చర్యపోయారు. ఇది నీటి అణువుల అమరికలోని క్రమశిక్షణను తోపాటు వ్యక్తిగత శక్తి తరంగాలను గుర్తించే సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది.

**నోబెల్ గ్రహీత జన్యు ప్రయోగం**

హెచ్ ఐ వి వైరస్‌ను కనుగొన్నందుకు నోబెల్ బహుమతి పొందిన ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూక్ మాంటాగ్నియర్ 2009లో నీటి జ్ఞాపకశక్తికి సంబంధించి మరో అద్భుతమైన ప్రయోగాన్ని ప్రపంచం ముందు ఉంచారు. ఒక సీసాలోని నీటిలో ఉన్న జన్యు సంకేత సమాచారాన్ని విద్యుదయస్కాంత తరంగాల ద్వారా మరో సీసాలోని స్వచ్ఛమైన నీటిలోకి బదిలీ చేయవచ్చని ఆయన నిరూ పించారు. ఆ స్వచ్ఛమైన నీరు ఆ జన్యు సంకేత తరంగాలను గుర్తుంచుకుని తనలో ఆ జీవకణం యొక్క ప్రతిరూపాన్ని సృష్టిం చుకోవడం శాస్త్రవేత్తలను విస్మయానికి గురిచేసింది. ఇది నీరు సమాచారాన్ని ఒక చోటు నుండి మరో చోటుకు చేరవేయగలదని అదృశ్య ముద్రలను భద్రపరుచుకోగలదని శాస్త్రీయంగా ధృవీక రించింది. భౌతిక పదార్థం లేకపోయినా సమాచారం బదిలీ అవ్వడం వెనుక ఉన్నది నీటి జ్ఞాపకశక్తి అని ఆయన గట్టిగా వాదించారు. మానవ మెదడులో 85 శాతం తోపాటు గుండెలో 73 శాతం నీరు ఉంటుంది. అంటే మనం తాగే నీరు మన ఆలోచనలకు ప్రతిబింబంగా మారుతోంది. తీర్థం లేదా పవిత్ర జలం అనే భావనలో నీటికి సానుకూల తరంగాలను ఎక్కించడం అనే రహస్యం దాగి ఉంది.

**ఔషధ మాఫియా వెనుక కుట్రలు**

నీటి జ్ఞాపకశక్తి సిద్ధాంతం నిజమైతే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఔషధ కం పెనీల పునాదులు కదులుతాయి. కేవలం నీటి తరం గాల ద్వారా రోగాలను నయం చేసే సాంకేతికత అందుబా టులోకి వస్తే వేల కోట్ల రూపాయల మందుల వ్యాపారం కుప్ప కూలుతుంది. అందుకే చాలా దేశాలలో ప్రయోగాలను అణచి వేయడానికి లేదా తప్పుడు ప్రచారంగా ముద్ర వేయడానికి కుట్ర పూరిత ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ స్విట్జర్లాండ్ తోపాటు జర్మనీ వంటి దేశాల్లో హోమియోపతిని గుర్తించడం వెనుక ఈ విజ్ఞానం ప్రధాన పాత్ర పోషిస్తోంది. చట్టపరంగా నీటి నాణ్యతను కేవలం శుభ్రతతో కాకుండా దానిలోని సమాచార స్వచ్ఛతతో కొలవాల్సిన రోజులు త్వరలో రాబోతున్నాయి. నీరు ఒక వాణిజ్య వస్తువు కాదు అది మానవ చైతన్యాన్ని ప్రభావితం చేసే ఒక శక్తి అని చట్టాలు గుర్తించాల్సి ఉంది. శాస్త్రవేత్తలు తోపాటు సామాజిక వేత్తలు కలిసి నీటి యొక్క అద్భుత ధర్మాన్ని మానవాళి ప్రయోజనం కోసం ఎలా ఉపయోగించుకోవచ్చో ఆలోచించాలి.

**పంచభూతాల పరమార్థం:**

నీరు ఒక మౌన ప్రేక్షకుడిగా మన చరిత్రను తోపాటు మన భావోద్వేగాలను తనలో నిక్షిప్తం చేసుకుంటోంది అందుకే దీనిని విశ్వపు స్మృతి కార్డు అని పిలవవచ్చు. రాబోయే కాలంలో నీటిని కేవలం దాహం తీర్చుకోవడానికే కాకుండా వ్యాధులను నయం చేయడానికి అలాగే మానసిక ప్రశాంతతను పెంచడానికి ఒక పరికరంగా వాడబోతున్నాం. మనం తాగే ప్రతి నీటి చుక్కకు ఒక కథ ఉంటుందని మనం ఇచ్చే ప్రతి ఆలోచనను అది స్వీకరిస్తుం దని గుర్తించడం ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకో వచ్చు. ప్రకృతిలో అత్యంత సాధారణంగా దొరికే నీరు అత్యంత క్లిష్టమైన జ్ఞాపకశక్తిని కలిగి ఉండటం సృష్టిలోని ఒక అద్భుతమైన వైరుధ్యం. నీటిని గౌరవించడం అంటే మన ఉనికిని మనం గౌరవించుకోవడమే ఎందుకంటే నీరు గుర్తుంచుకుంటుంది తోపాటు నీరు స్పందిస్తుంది అలాగే నీరు మనల్ని నిర్మిస్తుంది. ఈ పరమ సత్యాన్ని గ్రహించి నీటిని దైవంగా భావించి పూజించే సంస్కృతిని మళ్ళీ మనం అలవర్చుకోవాలి.

**-ఫిరోజ్ ఖాన్,**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
5-7-2026

# పేదలకు ఇల్లు నిర్మించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## మున్సిపాలిటీ కౌన్సిలర్ నాజియా మక్బూల్



**కల్వకుర్తి (సింగిడి):** పేదల కల నెరవేరేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ నాజియా మక్బూల్ అన్నారు. బుధ వారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలను కౌన్సిలర్ నాజి యా మక్బూల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లబ్ధిదారుడు దస్తీ ఈదన్నకు రెండవ విడత బిల్లు మంజూరు,మత్తమల్ల అలివేలుకు చివరి బిల్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 18వ వార్డులో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేటట్లు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ విజయ్, కాలనీవాసులు హాజి,ఆమేర్,తదితరులు పాల్గొన్నారు.

# ఐతమోని సత్తయ్య మృతి బాధాకరం



**చింతపల్లి, (సింగిడి):** మండలం లోని తీదేడు గ్రామానికి చెందిన ఐతమోని సత్తయ్య మృతి బాధాకరమని కాంగ్రెస్ పార్టీ సిని యర్ నాయకులు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ కాయితీ జితేందర్‌రెడ్డి అన్నారు.బుధవారం తీదేడు గ్రామంలో అనారోగ్యంతో మరణించిన ఐతమోని సత్తయ్య మృతదేహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపి 5 వేలు ఆర్థిక సాయం అంద జేశారు. గ్రామంలో ఎవరికీ ఏ ఆపద వచ్చిన తమవంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు.ఆయన వెంట మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు శివర్ల శంకర్, నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రాకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నేలపట్ల మురళి, గుణమోని శ్రీనివాస్, గంటల నరేష్, ఐతమోని వెంకటయ్య, సందే బిక్షం తదితరులు ఉన్నారు.

### భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# జి.వి శ్యామ్ ప్రసాద్ లాల్‌కు ఘన సన్మానం

### భారత పరిపాలనా సేవ (ఐఏఎస్) పదోన్నతిపై అభినందనలు వెల్లువ



**కరీంనగర్, (సింగిడి):** భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ లైఫ్ మెంబర్‌గా ఉన్న జి .వి .శ్యామ్ ప్రసాద్ లాల్ భారత పరిపాలనా సేవ (ఐఏఎస్) పదోన్నతి పొందిన సందర్భంగా అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మేయర్ ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అధ్యక్షత వహిం చారు. ఉపాధ్యక్షులు మనోహర్, చీటి రామారావు సభ్యులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన యాదగిరి సునీల్ రావు , శ్యామ్ ప్రసాద్ లాల్ పదోన్నతిపై హర్షం వ్యక్తం చేస్తూ, కరీంనగర్ జిల్లా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు. ఆయన ఏ పదవిలో ఉన్నా ప్రజల మన్ననలు పొందే విధంగా కర్తవ్యనిష్ఠతో పనిచేసే వ్యక్తి అని ప్రశంసించారు.సన్మానానికి ప్రతిస్పందించిన శ్యామ్ ప్రసాద్ లాల్ , ఈ గౌరవానికి అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భగత్ నగర్ తన సొంత ప్రాంతమని, అక్కడి ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఏ బాధ్యత వచ్చినా ప్రజాసేవకే ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు.

# భైంసాలో ప్రమాద హెచ్చరికల బోర్డు ఏర్పాటు

### అప్రమత్తంగా డ్రైవ్ చేయడం ద్వారా ప్రమాదాలను నివారించ వచ్చు

### జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్



**నిర్మల్ ప్రతినిధి,(భైంసా) (సింగిడి):** రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన "అరైవ్ అలైవ్ -- 2026" కార్యక్ర మంలో భాగంగా ఈరోజు భైంసా పట్టణంలోని బస్‌డిపో సమీ పంలో ఉన్న గడ్డేన వాగు వంతెనపై ప్రమాద హెచ్చరిక బోర్డును పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. కొన్ని రోజుల క్రితం ఇదే వంతెనపై ప్రమాదం జరిగి నలుగురు మృతి చెందడం జరిగింది. ఈ ప్రమాద ఘటనను దృష్టిలో ఉంచుకొని, ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కావున వాహనదారులు ఈ వంతెన ప్రాంతంలో వేగాన్ని తగ్గించాలని,ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని,అప్రమత్తంగా డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలను నివారించ వచ్చని తెలిపారు.

# వ్యవసాయ యంత్ర పరికరాల అందజేత



**కొమురం భీం ఆసిఫాబాద్ (సింగిడి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రం లో సబ్ మిషన్ ఆన్ అగ్రి కల్చర్ మేకనైజేషన్ పథకం ద్వారా మంజూరైన వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలను బుధవారం రైతులకు అందజేసినట్లు మండల వ్యవసాయ అధి కారి పి. ప్రేమలత తెలిపారు. బుధ వారం 7 పెట్రో ల్ పంపులు, 2 రోటోవేటర్లు పంపిణి చేసామని ఆమె తెలిపారు. ఈ కార్యక్ర మం ద్వారా రైతులకు వ్యవసాయా నికి సంబందించిన వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలు, రోటవేటర్లు, కల్టీవేటర్లు, ఫ్లౌలు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు, బేలర్ ( వరి గడ్డి కట్టలు కట్టే మిషన్ ) పెట్రోల్ పంపులు ( మందు కొట్టె డబ్బా), బ్యాటరీ పంపులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పెండోర్ ప్రేమలత తెలిపారు. కౌటాల మండలానికి 12 రోటోవేటర్లు,31 పెట్రోల్ పంపులు, 78 బ్యాటరీ పంపులు,2 విత్తనాలు వేసే గొర్రులు, 13 కల్టీవేటర్, ఫ్లౌలు, ఒక పవర్ వీడర్, 2 పవర్ టిల్లర్లు,3 బ్రష్ కట్టర్లు అలాట్ అయ్యాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ అలాగే జనరల్ రైతులకు 40 శాతం సబ్సిడీ రైతులకు యంత్ర పరికరాలు అందించడం జరుగుతుంది అని తెలిపారు. ఇంకా వ్యవసాయ పరికరాలు అవసరం ఉన్న రైతులు వ్యవసాయ అధికారి కార్యాలయం ను లేదంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదిం చాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రేమలత వ్యవసాయ విస్తరణ అధికారులు అంజన్న , ఘన్ శ్యామ్, రేష్మిత మరియు వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పలు ప్రజా సమస్యలపై సమావేశం

### ఏర్పాటు చేసిన మాజీ కార్పొరేటర్ శ్రవణ్



**మల్కాజిగిరి, (సింగిడి):** మల్కాజిగిరి డివిజన్ లోని పలు ప్రజా సమస్యలపై బుధవారం మాజీ కార్పొరేటర్ శ్రవణ్ బలరాం నగర్ వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్ తో వాజ్పేయి నగర్ లోని తన కార్యాలయంలో సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ ఇటీవల మంజూరు చేయబడిన భూగర్భ డ్రైనేజీ పనులు ఇంకా పూర్తి కాలేదని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనేకచోట్ల పాడైపోయిన మెన్ హోల్ సగం విరిగిపోయిన మాన్ హోల్ కవర్లు దర్శనమిస్తున్నాయని వాటిని బాగు చేయాలని, మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని రానున్న వేసవిలో రిజర్వాయర్ల మోటార్ల సమస్య తలెత్తకుండా ఉన్నతాధికారులతో తగిన చర్యకై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవి, మురళి, లక్ష్మన్ యాదవ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్ నో పెట్రోల్: సీఐ వెంకటేశ్వర్లు

**మహదేవపూర్ (సింగిడి):** నో హెల్మెట్ నో పెట్రోల్ అంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని పెట్రోల్ బంకుల్లో సిఐవెంకటేశ్వర్లు, ఎస్సై పవన్ కుమార్ లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై పెట్రోల్ కు వస్తే బంకుల్లో వాహనాలకుపెట్రోల్ పోయవద్దని బంకు యజమానులకు సూచించారు. జీవితం అమూల్యమైనదనిజాగ్రత్తలు పాటిస్తూ జీవితాన్ని కాపాడుకోవాలని రిస్కులో పడేసుకోవద్దని ఈసందర్భంగా బంకు వచ్చిన పలువురు ద్విచక్ర వాహనదారులకు సిఐ ఎస్ఐలువివరించారు. ఈ కార్యక్రమంలో బంకు యజమాని చల్ల తిరుపతిరెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మంత్రిపై అనుచిత వాక్యాలు చేస్తే ఊరుకునేదే లేదు కాంగ్రెస్ నాయకులు

### ఖబర్దార్ బిఆర్ఎస్ నోరు అదుపులో పెట్టుకోవాలి వైస్ చైర్మన్ వినయ్ కుమార్





**చెన్నూర్ (సింగిడి):** చెన్నూరు పట్టణంలో పత్రికా సమావేశం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు బి ఆర్ఎస్ నాయకుల పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బి ఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే మంత్రి వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మరోసారి మా కాంగ్రెస్ పార్టీ నాయకుల పై కానీ, స్థానిక ఎమ్మెల్యే మంత్రి వివేక్ వెంకటస్వామి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించరూ మొన్న క్యాతనపల్లిలో ఎక్స్ అఫిషియో ఓటు హక్కు వినియోగించుకో వడానికి వెళ్లిన మంత్రి కారు పైన మీ నాయకుడు బాల్క సుమన్ దాడి చేశాడు అందుకే శిక్ష అనుభవిస్తున్నారు తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించక తప్పదని అన్నారు మాజీ కౌన్సిలర్ రెవెల్లి మహేష్ పై విర్రుకో పడ్డ కాంగ్రెస్ కౌన్సిలర్ లు నాయకులు మద్యం అమ్ముకుని వ్యక్తివి నువ్వు నోరు అదుపులో పెట్టుకో లేకపోతే రానున్న రోజుల్లో మూల్యం చెల్లించక తప్పదు అని హెచ్చరించరూ ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# ఇంటర్ మొదటి రోజు పరీక్షలు ప్రశాంతం

### హాజరు శాతం 96.90% : జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్

**సంగారెడ్డి (సింగిడి):** జిల్లాలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగా యని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు.మొత్తం 18,179 మంది విద్యార్థులకు గాను 17,616 మంది విద్యార్థులు హాజర య్యారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 16,438 మంది, వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 1,178 మంది విద్యార్థులు ఉన్నారు.మొత్తం 563 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అందులో జనరల్ కోర్సుకు చెందిన 414 మంది, వృత్తి కోర్సుకు చెందిన 149 మంది విద్యార్థులు ఉన్నారు.మొత్తం హాజరు శాతం 96.90%గా నమోదైంది. ఎటు వంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలే దని ఆయన తెలిపారు.పరీక్షల నిర్వహ ణను పర్యవేక్షించేందుకు కన్వీనర్/డీఐఈఓ 2 పరీక్ష కేంద్రాలను, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలను, హెచ్‌పీసీ సభ్యులు 4 కేంద్రా లను, ఫ్లయింగ్ స్క్వాడ్లు 11 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు గోవింద్ రామ్ తెలిపారు.

# ఎల్లమ్మబండలో 14 తులాల బంగారం అపహరణ

### ఆధునిక సాంకేతిక ఆధారాలతో కేసులు చేదించిన పోలీసులు. తాళాలు వేసి తాళం చేయను ఇంటి బయట పెట్టొద్దని సూచించిన జగద్గిరిగుట్ట పోలీసులు.





**కుత్బుల్లాపూర్, (సింగిడి):** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండలో 14 తులాల బంగారం అపహరణ కేసు వెలుగుచూసింది. తాళం చెవిని డ్రమ్ కింద దాచిన విషయాన్ని గమనించిన నిందితుడు దాచిన తాళం చెవులు తీసుకొని ఇంట్లోకి ప్రవేశించి 14 తులాల నగలు దోచుకున్నాడు. తిరిగి వచ్చిన ఇంటి యజమానులు ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని గమనించి జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఫిర్యాదు అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు ఆధునిక సాంకేతిక ఆధా రాలతో నిందితుడు శంకర్ను అరెస్ట్ చేసి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నా రు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీ సులు మాట్లాడుతూ ఊర్లకు వెళ్లే సమ యంలో తాళాలు వేసి వాటికి సంబం ధించిన తాళం చెరువులను బయట దాచవద్దని పోలీసులు సూచించారు.

# తాడిచెర్ల భూ నిర్వాసితులకు ఊరట

## ఇళ్ల సేకరణకు జెన్కో సీఎండీ హామీ

### - మంత్రి శ్రీధర్ బాబు చొరవతో సచివాలయంలో కీలక భేటీ, సమస్యకు శాశ్వత పరిష్కారం

### - సర్పంచ్ బండి స్వామి ఉప ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు నాయకత్వంలో వార్డ్ సభ్యులు మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాయకత్వంలో ఫలించిన బాధితుల పోరాటం



**మల్హర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ గనుల ప్రభావిత ప్రాంతంలో (డేంజర్ జోన్) నివసిస్తున్న భూనిర్వాసితుల ఎనిమిదేళ్ల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడనుంది. గనుల బ్లాస్టింగ్ జోన్ పరిధిలోని ఇళ్లను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని జెన్కో సీఎండీ ఎన్. హరీష్ స్పష్టమైన హామీ ఇచ్చారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో హైదరాబాద్ సచివాలయంలో బుధవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.మహిళల పోరాటం.. సర్పంచ్ చొరవ గత ఎనిమిదేళ్లుగా ప్రాణాపాయ స్థితిలో నివసిస్తున్న తాడిచెర్ల ప్రజలు,ముఖ్యంగా మహిళలు ఇటీవల గడిచిన వారం రోజులలోనే రెండుసార్లు గనుల పనులను అడ్డుకుని తమ నిరసనను గట్టిగా వినిపించారు. ఈ క్రమంలో సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు మహిళలకు సర్దిచెప్పి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విజయం సాధించారు. హైదరాబాద్‌కు సుమారు 30 మంది గ్రామస్తులతో కలిసి వచ్చిన సర్పంచ్, మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించి ఈ సమావేశం ఏర్పాటు అయ్యేలా చేశారు. కీలక నిర్ణయాలు సమావేశంలో సీఎండీ హరీష్ మాట్లాడుతూ.. 2011-12 సర్వే ప్రాతిపదికన భూనిర్వాసితులకు పరిహారం మరియు పునరావాసం కల్పిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిం చనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో ఎనిమిదేళ్లుగా భయం గుప్పిట్లో బతుకుతున్న బాధితుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.తమకు అండగా నిలిచిన మంత్రికి, సర్పంచ్‌కు భూనిర్వాసితులు మరియు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, ఎన్ఆర్‌జీఈఎస్ రాష్ట్ర కౌన్సిలర్ దండు రమేష్, సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు, కేసారపు చంద్రయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, మాజీ సర్పంచ్ దన్నపునేని అశోక్ రావు, వార్డు సభ్యులు పైడాకుల దేవేంద్ర సమ్మయ్య, ఇందారపు చంద్రయ్య, ఇందారపు సారయ్య, ఇందారపు శ్యామల శ్యాం కుమార్, కాంగ్రెస్ యూత్ నాయకులు బండి రణధీర్ రావు,తాడిచర్ల భూ నిర్వాసితులు కేసరపు రవి, ఆర్ని ఉదయ్, తాండ్ర మల్లేష్, మహిళలు, జంజర్ల విజ్జక్క, కుర్రి దేవక్క, చాట్ల పెల్లి రాజలక్ష్మి, చాట్లపల్లి లక్ష్మి, బూడిదలక్ష్మి, బీర్నేని బానేషా, కాజీపేట స్వప్న, దేవర గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు

# మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ద్వారా నే అభివృద్ధి సాధ్యం

### - దుద్దిల్ల శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన తాండ్ర మల్లేష్



**మల్హర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిల శ్రీధర్ బాబు, సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన తాండ్ర మల్లేష్, తాడిచెర్ల మంథని నియోజకవర్గం లో దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ద్వారా నే అభివృద్ధి సాధ్యమని 2013 సంవత్సరంలో ఓపెన్ కాస్టులో భూములకు నష్టపరిహారం చెల్లించడం వారి ద్వారానే జరిగింది ఇప్పుడు డేంజర్ జోన్ లో ఉన్న ఇండ్ల కు, భూములకు నష్టపరిహారం ఇప్పించే సత్తా ఉన్న నాయకుడని ప్రజల మేలుకోరే మనసున్న నాయకుడని నమ్మి తిరిగి మాతృ పార్టీయైన కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఇట్టి విషయంలో సహకరించిన శ్రీ అయిత ప్రకాష్ రెడ్డి, చైర్మెన్, ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిమెంబెర్ దండు రమేష్, మాజీ సర్పంచ్ దనపునేని అశోక్ రావు, సర్పంచ్ బండి స్వామి, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు, కేసరపు చంద్ర య్య, ఇందారపు చంద్రయ్య , ఇందారపు శివకుమార్. నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# నో హెల్మెట్ నో పెట్రోల్: సీఐ వెంకటేశ్వర్లు



పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

**మహదేవపూర్, (సింగిడి):** రోడ్డు సేఫ్టీ వారోత్సవాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదే వపూర్ మండలంలోని పెట్రోల్ బంకుల వద్ద సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న అంశాల మీద యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బంకు యజమానులకు సూచించారు. హెల్మెట్ లేకుండా వచ్చే వాహనదారులకు పెట్రోల్ పోయకూడదని ,ఎక్కువ స్పీడుగా వాహనాలు నడపవద్దని పెట్రోల్ కు వచ్చిన వారికి తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమా నాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పవన్ కుమార్, బంకు యజమాని చల్ల తిరుపతిరెడ్డి తోపాటు

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



**చేవెళ్ల (సింగిడి):** కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహ త్యకు పాల్పడ్డ ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ సీఐ కాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం.. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం తిమ్మారెడ్డి గూడ గ్రామానికి కురుమ సత్తయ్య తండ్రి లెట్ రామయ్య. వయస్సు: 40 సంవత్సరాలు (కులం బీసి కురుమ) వృత్తి వ్యవసాయం, సావిత్రి కి సత్తయ్య కు 25 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వీరికి కూతురు కొడు కు, కూతురు ఉన్నారు...సత్తయ్య తండ్రి రామయ్యకు ఇద్దరు కొడుకులు ఐదుగురు కూతుళ్లు ఉన్నారు.. సత్తయ్య తోబుట్టులు (ఆడపడుచులు) వారి తండ్రి ఆస్తిలో వాటకావాలని కోర్టులో కేసు వేశారని, భూమిని తోబుట్టువులకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. 25-2026 రోజున అంజాద ఎనిమిది గంటల సమయంలో సత్తయ్య ఆడపడుచులు భూమి కబ్జా ఇవ్వాలని ఫోన్ చేశారు..భూమి (కిరికిరి) వివాదంలో ఉందని సరిచేసుకునన్న తర్వాత కబ్జా ఇస్తానని తెలిపారు.. ఈ టెన్షన్ లో సత్తయ్య మద్యం సేవించి ఇంటికి వెళ్లి భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సావిత్రి భర్తకు దాదాపు 11:00 గుటలకు ఇంటికి వచ్చి తిని వెళ్ళమని ఫోన్ చేసిందని కాని ఇంటికి రాలేదు. ఆ తర్వాత మధ్యాహ్నం 2:30 నిమిషాల సమయంలో పొలం వద్ద వేప చెట్టుకు డ్రిప్ పైపుతో ఉరివేసుకొని ఉన్నాడని, మేకలు కాసే వాళ్ళు, నా కుమారుడు వినయ్ కు ఫోన్ చేసి తెలపగ, వెంటనే నేను గ్రామస్తులతో పొలం వద్దకు చేరుకుని, చెట్టుకు వేలాడుతున్న భర్తను కిందికి దింపి చూడగా చనిపోయాడని తెలిపారు.. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమని తెలిపారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



**కల్వకుర్తి, (సింగిడి):** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు కల్వకుర్తిలో బుధవారం ప్రశాం తంగా ప్రారం భమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహిం చిన తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష సమయాన్ని కన్నా ముందే సెంటర్ వద్దకు చేరుకున్నారు. పట్టణంలో మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలలో 1700 మంది విద్యార్థులు కేటాయించగా 1642 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరిం టెండెంట్ రాంరెడ్డి తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందో బస్త్ ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ సామాగ్రిని పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించలేదు. విద్యార్థినీ, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షాల్లోకి పంపించారు. సీసీ కెమెరాల నిఘా మధ్య ఇంటర్ తొలి పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

## బొమ్మకల్‌లో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి

### రెండు ట్రాక్టర్లు స్వాధీనం నిందితులు అదుపులోకి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి



**కరీంనగర్ (సింగిడి):** కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో నిర్వహించిన గస్తీ సందర్భంగా బొమ్మకల్ గ్రామం ఫ్లైఓవర్ వంతెన వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. బొమ్మకల్‌కు చెందిన దుండుగోల రవి తన యజమాని సుద్దాల పరశురాములు ఆదే శాల మేరకు, అలాగే మ్యాదరవేణి రాములు తమ ట్రాక్టర్లలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం న్యాయస్థానానికి తరలించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్‌పోలీస్ స్టేషన్‌ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు...



**మంథని (సింగిడి):** ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రో జు తెలుగు, హిందీ.. సంస్కృతం,.. ఉర్దూ.. పరీక్షలు జరి గాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలికల కళాశాలలో మొత్తం 208 మంది విద్యార్థులకు గాను 202 మంది హజరయ్యారు. బాలుర కళాశాలలో 158 మందికి గాను 154 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేపటి నుంచి ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.





## సీఎం కప్ కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ

**మంచిర్యాల (సింగిడి):** ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ కరాటే పోటీలలో మంచిర్యాల జిల్లాకు చెందిన క్రీడాకా రులు ప్రతిభ కనబరిచారు. నస్పూర్‌కి చెందిన అన్విత 59 కేజీల విభాగంలో కాంస్య పతకం, బెల్లంపల్లికి చెందిన ఏ అభిషేక్ ౦75 విభాగంలో కాంస్య పతకం, సాధించారు. జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివ మహేష్, (డి వై ఎస్ ఓ )హనుమంతు రెడ్డి , జిల్లా కరాటే సభ్యులు వి. రవి అవుల రాజనర్సు అభినందించారు.

## కళాశాల విద్యార్థినిలకు ఏఎమ్మార్ బస్సు ద్వారా ఉచిత సేవలు



**మల్హర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ఇంటర్ పరీక్ష కేంద్రానికి కస్తూరిబ్బా, మోడల్ స్కూల్, తాడిచెర్ల జూనియర్ కళాశాల విద్యార్థులకు తాడిచెర్లలో ఏఎమ్మార్ కంపెనీ బస్సు ద్వారా ఉచితంగా సేవలందిస్తున్నారు. పరీక్షలు ముగిసేవరకు ఈ సేవలు కొనసాగుతాయని తెలియజేశారు.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం



**అల్వాల్, (సింగిడి):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఉదయం 9 గంటల నుండి ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి అల్వాల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం లకు సకాలంలో విద్యార్థులు పరీక్షల సెంటర్లకుకు హాజరై నారు శ్రీచైతన్య,నారాయణ ,వైభవ్, ఇతరత్రా కాలేజీలలో పరీక్ష కేం ద్రాలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభాతవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
5-7-2026

## నేడు అమరచింతలో మంత్రి వాకిటి శ్రీహరి పర్యటన



**అమరచింత, (సింగిడి):** అమరచింత మండలంలోని నాగల్ కడుమూర్ గ్రామంలో నేడు రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిడి పర్యటిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ తెలిపారు. గ్రామంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్స వంలో మధ్యాహ్నం మూడు గంటలకు మంత్రి పాల్గొంటారని తెలిపారు. మంత్రి వెంట టిపిసిసి కల్లు గీత సెల్ రాష్ట్ర చైర్మెన్ కేశం నాగరాజు గౌడ్ హాజరవు తారని పేర్కొన్నారు. మంత్రి కార్యక్రమానికి మండలం లోని వివిధ గ్రామాల అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, సింగల్ విండో డైరెక్టర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు .

## కస్తూరిబా బాలికల పాఠశాలను సందర్శించిన అధికారులు



**వలిగొండ, (సింగిడి):** మండలంలోని లోతుకుంటలో గల కస్తూరిబా బాలికల పాఠశాలను స్థానిక అధికారులు ఎంపిడిఓ జలంధర్ రెడ్డి, తహశీల్దార్ దశరథ, ఎంఈఓ భాస్కర్ లు బుధవారం సందర్శించారు. ఈ సందర్భముగా వారు విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిమాణం, నాణ్యత, ఉపాధ్యాయుల పని విధానం తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి పరీక్షల పట్ల విద్యార్థులు తీసుకోవలిసిన జాగ్రతలను వివరించారు. 10వ తరగతి పరీక్షలలో ఉన్నత మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. వాటితో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చమ్మ కు నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**వలిగొండ, (సింగిడి):** మండల పరిధిలోని కంచనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గంగారం రమేష్ మాతృమూర్తి గంగారం బుచ్చమ్మ మృతి చెందారు. బుధవారం బిఆర్ఎస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు డేగల పాండు యాదవ్, మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్, సర్పంచులు పనుమటి మమతా నరేందర్ రెడ్డి, ఆవుల నర్సింహా, బొడిగె లింగస్వామి, మోటే జంగమ్మ లింగస్వామి, పల్సం రమేష్, కొమిరెల్లి బాలకృష్ణా రెడ్డి, నర్సింహా, మహేష్, సత్యనారాయణ, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్ష

**వలిగొండ, (సింగిడి):** మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనట్లు పరీక్ష కేంద్రం సిఎస్ పరుశరాములు మంగళవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షకు 292 మంది విద్యార్థులకు గాను 286 మంది విద్యార్థులు పరీక్షలు హాజరై 6 గురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన
### సర్పంచ్ ఏర్పుల వెంకటేశం



**వలిగొండ, (సింగిడి):** మండల పరిధిలోని వేములకొండ గ్రామంలో బుధవారం వేములకొండ నుండి చిత్తాపురం వెళ్లే రోడ్డుకు సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కాడిగళ్ల రామనర్సింహా, అంబటి గిరిబాబు, కట్ట జ్యోతి అశోక్, పులిపలుపుల అండాలు మల్లేశం, బత్తుల సువర్ణ మల్లేశం నాయకులు ఎలగందుల కృష్ణమూర్తి, షేక్ రసూల్, పులిపలుపుల రాములు, పులిపలుపుల మల్లేశం, ఏర్పుల యాదయ్య,కాడిగళ్ళ లింగయ్య, ఇంజమూరి లక్ష్మణ్, అంబాల ఊషయ్య, పులిపలుపుల శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవే లక్ష్యం...
### సన్మానంతో మరింత బాధ్యతలు పెరిగిన కార్పొరేటర్
కార్పొరేటర్ నిమ్మ రాజుల రజిని రవికి ఘన సన్మానం
మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఘన సత్కారం



**గోదావరిఖని (సింగిడి):** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 29 వ డివిజన్ కార్పొరేటర్‌గా విజయం సాధించిన నిమ్మ రాజుల రజిని రవిని మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన ఈ అభినందన కార్యక్రమం ఉత్సాహభరిత వాతావ రణంలో జరిగింది. సేవా దృక్పథంతో ముందుకు... అభివృద్ధే లక్ష్యం,ఈ సందర్భంగా మాట్లాడిన కార్పొ రేటర్ రజిని రవి, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 29 వ డివిజన్ అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌ లిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తానని హామీ ఇచ్చా రు.పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో నగర శుభ్రతకు కట్టుబాటు,కార్యక్రమంలో శానిటే షన్ ఇన్స్పెక్టర్, శానిటేషన్ సూపర్వైజర్ తది తర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. డివి జన్‌లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయడానికి సమన్వయంతో పని చేస్తామనివారు తెలిపారు. కార్పొరేటర్ నాయ కత్వంలో శు భ్రమైన, సక్రమమైన డివిజన్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు

**.ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం**

సన్మాన కార్యక్రమం సందర్భంగా పుష్పగుచ్ఛాలు, శాలువాలతో కార్పొరేటర్‌ను సత్క రించారు. ఈ ఘన సన్మానం 29 వ డివిజన్ ప్రజల్లో కొత్త ఆశలు నింపింది. ప్రజా సేవకు అంకితభావంతో ముందుకు సాగుతున్న నిమ్మ రాజుల రజిని రవికి స్థానికులు అభినం దనలు తెలియజేశారు. 29 వ డివిజన్‌లో అభివృద్ధి కొత్త అధ్యాయానికి ఇది శ్రీకారం చుట్టిందని స్థానికులు అభిప్రా యపడ్డారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని బలవన్మరణం

## వసంత మృతి వెనుక వీడని మిస్టరీ..?
## ప్రియుడి ఆత్మహత్యే కారణమా?

**నిర్మల్ ప్రతినిధి,(సింగిడి):** విద్యాకుసుమాలు వికసించాల్సిన నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్ బుధవారం ఉదయం ఒక్కసారిగా శోకసంద్రంగా మారింది. వనపర్తి జిల్లాకు చెందిన వసంత అనే 19 ఏళ్ల విద్యార్థిని, ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్ గదిలో ఉరివేసుకుని ప్రాణాలు విడవడంతో తోటి విద్యార్థులంతా నివ్వెరపోయారు. ప్రతిరోజూ లాగే విద్యార్థినులందరూ ఉదయాన్నే క్లాసులకు వెళ్లగా, యమునా హాస్టల్‌లోని తన గదిలో వసంత విగతజీవిగా వేలాడుతూ కనిపించడం తీవ్ర కలకలం రేపింది. గదిలో వసంతను గమనించిన సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించి, ఆమె అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో వర్సిటీ ప్రాంగణం మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి.

**ప్రేమ వ్యవహారం.. షాకింగ్ మలుపులు**

ఈ ఆత్మహత్య వెనుక గల కారణాలను విశ్లేషిస్తున్న పోలీసులకు విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడయ్యాయి. వసంత గత ఐదేళ్లుగా గణేష్ అనే యువకుడితో గాఢమైన ప్రేమలో ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. మంగళవారం రాత్రి గణేష్ నుంచి ఆమెకు ఫోన్ కాల్ రావడం, ఆ తర్వాత జరిగిన సంభాషణ ఆమెను తీవ్ర మనోవేదనకు గురిచేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ కథనంలో అత్యంత విషాదకరమైన మలుపు ఏంటంటే, వసంతతో మాట్లాడిన కొద్దిసేపటికే గణేష్



హైదరాబాద్‌లోని ఒక హాస్టల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ప్రియుడు బలవన్మరణానికి పాల్పడ్డాడన్న విషయం తెలుసుకున్న వసంత, ఆ తీవ్ర దుఃఖాన్ని తట్టుకోలేకపోయిందని పోలీసులు భావిస్తున్నారు. ఆమె మొదట కత్తితో తన చేతిపై మరియు మెడపై గాట్లు పెట్టుకుని తీవ్రంగా గాయపరచుకున్నట్లు, ఆ తర్వాతే హాస్టల్ గదిలో ఉరివేసుకుని మరణించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

**విద్యార్థుల ఆగ్రహం.. వీసీ ఛాంబర్ ముట్టడి**

వసంత మృతదేహంపై ఉన్న కత్తి గాట్లు చూసిన తోటి విద్యార్థులు ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. కేవలం ప్రేమ వ్యవహారం అని చెప్పి ఈ కేసును మరుగున పడేయవద్దని, ఆ గాయాలకు గల అసలు కారణాలను నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేశారు. పోలీసులు చెబుతున్న కథనంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వందలాది మంది విద్యార్థులు వీసీ ఛాంబర్‌ను ముట్టడించారు. సరైన కారణం చెప్పే వరకు కదిలేది లేదని భీష్మించుకోవడంతో వర్సిటీ ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో భారీగా పోలీసు బలగాలను మోహరించాల్సి వచ్చింది. విద్యార్థిని మృతికి చదువుల ఒత్తిడి కారణమా లేక మరేదైనా వేధింపులు ఉన్నాయా అన్న కోణంలో కూడా స్పష్టత ఇవ్వాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**పోలీసుల లోతైన దర్యాప్తు**

ఈ జంట మరణాలకు గల అసలు ప్రేరణ ఏంటి, వారి బంధానికి కుటుంబ సభ్యులు అంగీకరించలేదా లేక ఇతర వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు ప్రస్తుతం లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. వీరిద్దరూ బంధువులే అయినప్పటికీ వారిని దూరం పెట్టాలనుకోవడానికి గల కారణాలేంటని పోలీసులు ఆరా తీస్తున్నారు. గణేష్ చివరి ఫోన్ కాల్‌లో ఏం చెప్పాడు, వారి మధ్య ఎలాంటి సంభాషణ జరిగింది అనే విషయాలను తెలుసుకోవడానికి ఫోన్ కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. చదువుల ఒత్తిడి కంటే వ్యక్తిగత సమస్యలే ప్రాణం తీశాయని అధికారులు చెబుతున్నప్పటికీ, విద్యార్థులు మాత్రం పూర్తిస్థాయి విచారణ జరగాలని పట్టుబడుతున్నారు. ఈ విషాద ఘటన అటు బాసర క్యాంపస్‌లో, ఇటు మృతుల స్వగ్రామాల్లో తీరని వేదనను మిగిల్చింది.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి





**నిర్మల్ ప్రతినిధి,(సింగిడి):** మామడ మండల కేంద్రంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు మామడ గ్రామంలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రూ. 10 లక్షలతో నా.ఎ.+ (ఎ.నా)భవన నిర్మాణానికి, రూ. 10 లక్షలతో నా.ఎ.+ (ఎ.నా) వర్క్ షెడ్ నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలో అకాల వర్షాలు, వడగళ్ళ వర్షాల కారణంగా ఎంత మేరకు పంట నష్టం వాటిల్లిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రకళ సురేందర్, ఉప సర్పంచ్ ప్రవీణ్, సీనియర్ నాయకులు బాపు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొండ్ర రాజారెడ్డి, మండల అధ్యక్షులు రంజిత్, తో పాటు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కాగితాలకే పరిమితమైన 74వ రాజ్యాంగ సవరణ..!

**మూడు దశాబ్దాల మోసం!**

**(?గాంధీజీ కన్న 'గ్రామ స్వరాజ్యం' గాలిలో కలిసిన వేళ: అధికార దాహానికి బలి అవుతున్న వ్యవస్థ!)**

భారతదేశం ప్రపంచ యవనికపై ఐదవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా వెలుగొందుతున్న వేళ, మన దేశ అభివృద్ధికి చోదక శక్తులుగా మారాల్సిన నగరాలు నేడు అనాథలయ్యాయి. దేశ రాజధానిలో ఆధిపత్యం కోసం, రాష్ట్రాల గద్దెలపై పట్టు కోసం సాగుతున్న రాజకీయ రణక్షేత్రంలో.. సామాన్యుడికి అతి సమీపం లో ఉండే స్థానిక సంస్థలు మాత్రం ప్రాణం లేని బొమ్మల్లా మారుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశ సమగ్రత పేరిట కేంద్రీకృత వ్యవస్థకు ప్రాణం పోసిన మన పాలకులు, కాలక్రమేణా ఆ వ్యవస్థనే ఒక అస్త్రంగా మార్చుకుని క్షేత్రస్థాయి స్వయంప్ర తిపత్తిని గొంతు నులిమేశారు. ముప్పై ఏళ్ల క్రితం రాజ్యాంగంలో చేసిన చట్ట సవరణలు ఒకప్పుడు ఆశాకిరణాల్లా కనిపించినా, నేడు తిరిగి చూసుకుంటే అవి కేవలం పాలకుల చేతుల్లో కాగితపు పులులుగానే మిగిలిపోయా యి. గాంధీజీ కన్న కలల 'గ్రామ స్వరాజ్యం' నేడు కేవలం ఎన్నికల ప్రసంగాలకే పరిమి తమై, అధికార దాహానికి బలి అవుతుండటం మన ప్రజాస్వామ్యానికే ఒక మాయని మచ్చ.

**రాష్ట్రాల పెత్తనం - ప్రజాస్వామ్య విఘాతం**

అధికార వికేంద్రీకరణ గురించి వేదికలపై గంభీర ఉపన్యాసాలు దంచే రాష్ట్ర ప్రభుత్వాలు, క్షేత్రస్థాయికి వచ్చేసరికి తమ అసలు రంగు బయటపెట్టుకుంటున్నాయి. కేంద్రం తమ హక్కులను హరిస్తోందని, రా ష్ట్రాల స్వయంప్రతిపత్తి దెబ్బతింటోందని గగ్గో లు పెట్టే ముఖ్యమంత్రులు, అదే అధికారాన్ని తమ కింద ఉన్న స్థానిక సంస్థలకు పం చడంలో మాత్రం పరమ పీనాసిలా వ్యవహరి స్తున్నారు. నేడు మన నగరాల్లో మేయర్ల పరి స్థితి ఎలా ఉందంటే, వారు కేవలం ఉత్సవ విగ్రహాలుగా, అలంకారప్రాయమైన ముద్ర లుగా మిగిలిపోయారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి కంటే, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధికారులకే సర్వాధికారాలు ఉండటం ఏ రకమైన పరి పాలనో పాలకులే సమాధానం చెప్పాలి. ప్రజ ల సమస్యల కంటే పైస్థాయి రాజకీయ యజ మానుల ప్రయోజనాలే పరమావధిగా మా రిన ఈ వ్యవస్థలో, స్థానిక నాయకత్వం అనే ది ఒక కట్టుకథగా మారుతోంది. అధికారుల కనుసన్నల్లో మెలిగే ప్రజాప్రతినిధులు ప్రజ లకు ఏ విధంగా జవాబుదారీగా ఉండగలరో అర్థం కాని ప్రశ్న.

**ఆర్థిక దిగ్బంధనం - నిధుల మళ్లింపు**

ఆర్థికంగా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయడం ఒక వ్యూహాత్మక కుట్రలా కనిపిస్తోం ది. రాజ్యాంగబద్ధంగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఏర్పాటు కావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘాలు నేడు కేవలం ఉనికి కోసమే అన్నట్లుగా ఉన్నాయి. ఈ సంఘాలు ఇచ్చే సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వాలు చెత్తబుట్టలో వేయడం ఒక ఆనవాయితీగా మార్చుకున్నాయి. నిధుల కోసం ప్రతి చిన్న పనికీ రాష్ట్ర ప్రభుత్వం ముందర చేతులు చాచి దీనంగా నిల బడాల్సిన దుస్థితిలో, స్థానిక సంస్థలు ప్రజ లకు ఏం సేవ చేయగలవు? ఒకవైపు ఆస్తి పన్నుల భారాన్ని, అభివృద్ధి రుసుములను సామాన్యుడిపై మోపుతూ, మరోవైపు ఆ నిధులను తమ రాజకీయ ప్రచార పథకాలకు మళ్లించడం ద్వారా నగరాల మౌలిక సదుపా యాలను రాష్ట్రాలు బలిపీఠం ఎక్కిస్తున్నాయి. కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా సకాలంలో స్థానిక సంస్థలకు చేరనీయకుండా అడ్డుకోవడం దారుణం. ఈ ఆర్థిక అస్థిరత వల్ల పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, మురు గునీటి పారుదల వంటి కనీస సౌకర్యాలు అస్తవ్యస్తమై, మన నగరాలు సమస్యల నిలయాలుగా మారుతున్నాయి.

**రాజకీయ వారసత్వం - నాయకత్వ లేమి**

రాజకీయంగా చూస్తే, మన దేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు నేడు కేవలం ధనవంతులకు, నేర చరిత్ర ఉన్నవారికి పునరావాస కేంద్రాలుగా మారాయి. ప్రపంచ దేశాలను గమనిస్తే, చిన్న స్థాయి నుండి మేయర్లుగా తమ సమర్థతను చాటుకుని దేశాధినేతలుగా ఎదిగిన గొప్ప నాయకులు ఎందరో ఉన్నారు. కానీ మన దగ్గర మాత్రం రాజకీయ పార్టీలు ఈ పదవులను తమ అనుచరులకు రివార్డులుగా లేదా తదుపరి శాసనసభ ఎన్నికల కోసం ఓటు బ్యాంకులను కాపాడే వ్యక్తులుగా చూస్తున్నాయి. దశాబ్దాల క్రితం నగర మేయర్లుగా పనిచేసి జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పిన మహనీయుల నాయకత్వం నేడు మృగ్యమైంది. మేయర్ పదవిని ఒక శక్తివంతమైన కార్యనిర్వాహక పదవిగా మార్చకుండా, కేవలం కొద్ది కాలా నికే ఒకరిని మార్చే పద్ధతులు ఈ వ్యవస్థను మరింత భ్రష్టు పట్టించాయి. వార్డు కమిటీలు కేవలం రికార్డుల్లోనే కనిపిస్తున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజల గొంతుకగా మారడం లేదు.

**పరిపాలనా లోపాలు - ప్రజల దూరం**

అధికార యంత్రాంగం, రాజకీయ వర్గాల మధ్య ఉన్న ఈ అపవిత్ర కలయిక వల్ల రాజ్యాంగం ఆశించిన 'ప్రజా భాగ స్వామ్యం' మచ్చుకైనా కనిపించడం లేదు. నగర ప్రణాళికలు శాస్త్రీయంగా జరగడం లేదు. జలవనరుల కబ్జాలు, అస్తవ్యస్తమైన నిర్మాణాలకు స్థానిక సంస్థలే మూలమ వుతున్నాయి, ఎందుకంటే వాటిపై ప్రజల నియంత్రణ లేదు. రాష్ట్ర ప్రభుత్వాల పెత్తనం ఎంతలా ఉందంటే, ఒక చిన్న వీధి దీపం వేయాలన్నా లేదా ఒక పాఠశాలలో మర మ్మతులు చేయాలన్నా రాష్ట్ర స్థాయి అనుమ తుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఇది వికేంద్రీకరణ కాదు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం.

నగరాలు అంటే కేవలం కాంక్రీట్ భవనాల సముదాయం కాదు, అవి దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోసే యంత్రాలు. ఆ ఊపిరిని నిలపాలంటే స్థానిక పాలనలో విప్లవాత్మక మార్పులు రావాలి. నేరుగా ప్రజల ద్వారా ఎన్నికయ్యే మేయర్ వ్యవస్థ ఉండాలి, ఆ మేయర్‌కు స్థిరమైన పదవీ కాలంతో పాటు పూర్తి నిర్ణయాత్మక అధికా రాలు ఉండాలి. అధికారుల పెత్తనం పోయి, ప్రజాప్రతినిధుల జవాబుదారీతనం పెరగాలి. రాష్ట్రాలు తమ పెత్తందారీ ధోరణిని వీడి, నిధులను, విధులను మరియు సిబ్బందిని పూర్తిగా స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. అప్పుడే రాజ్యాంగ సవరణలకు సార్థకత లభిస్తుంది. పాలకులారా, కళ్ళు తెరవండి! మీ తాత్కాలిక అధికార దాహానికి ప్రజా స్వామ్య మూలాలను, గాంధీజీ కలలను బలి ఇవ్వకండి. అభివృద్ధి అనేది పైనుంచి కిందికి రావడం కాదు, కింది స్థాయి నుంచే బలంగా ఎదగాలి. స్థానిక సంస్థలు బలోపేతమైనప్పుడే భారత్ నిజమైన అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది.



**వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

# ధర్మపురి బ్రహ్మోత్సవాల సందర్భం... పరిశుభ్రతపై సమిష్టి సంకల్పం

## బ్రహ్మోత్సవాల వేళ గోదావరి శుభ్రతా యజ్ఞం

ధర్మపురి క్షేత్రం అనగానే భక్తుల మనసులో మొదట మెదిలేది పవిత్ర గోదావరి తీరం, ఆ తీరాన వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య క్షేత్రం. తెలంగాణ ఉత్తర భాగంలో ఆధ్యాత్మిక కాంతిని విరజిమ్ముతూ నిలిచిన ఈ పుణ్యస్థలం శతాబ్దాల చరిత్రను, విశ్వాసాన్ని, సంస్కృతిని మోస్తూ వస్తోంది. ప్రతి సంవత్సరం జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు కేవలం ఆలయ ఉత్సవాలే కాదు; అవి ప్రాంతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవనానికి ఊపిరి పోసే మహోత్సవాలు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుండి మార్చి 11 వరకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారల బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో క్షేత్రం మరోసారి భక్తి వైభవంతో కళకళ లాడేందుకు సిద్ధమవుతోంది.

అయితే ఈ వైభవానికి నీడలా వెంటాడుతున్న ఒక ప్రధాన సమస్య కలు షితమవుతున్న గోదావరి. పుణ్యస్నానాల కోసం, దీక్షల ముగింపుగా, వ్రతాల అనంతరం భక్తులు గోదావరిలో స్నానం చేయడం శతాబ్దాల పరంపర. కానీ అదే భక్తి ఉత్సాహం కొన్నిసార్లు అవగాహన లోపంతో కలుష్యానికి దారితీస్తోంది. జంతు బలులు, పూజా సామగ్రి అవశేషాలు, దీక్షా వస్త్రాల విసర్జన, ప్లాస్టిక్ సంచులు, పూల మాలలు, కొబ్బరికాయల అవశేషాలు, దేవతల అద్దాల చిత్రపటా లు–ఇవి అన్నీ గోదావరి ఒడ్డున ఎక్కడ పడితే అక్కడ పడేయడం నేటి కాలుష్యా నికి ప్రధాన కారణాలుగా మారాయి. పవిత్రతకు ప్రతీకగా నిలిచే నదీ తీరమే చెత్తా చెదారంతో నిండి పోవడం బాధాకరం.మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు రోజూ శ్రమిస్తున్నా, ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ కారణంగా చెత్త పరిమాణం అనూహ్యంగా పెరుగుతోంది. ఒకవైపు భక్తుల ప్రవాహం, మరోవైపు పరిమిత వనరులు---ఈ రెండింటి మధ్య పారిశుద్ధ్య సిబ్బంది కృషి చాలాసార్లు కనిపించకుండా పోతుంది. శుభ్రం చేసిన తీరమే గంటల్లో మళ్లీ మురికిగా మారడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తోంది. అయినప్పటికీ వారు నిరంతరం సేవలో నిమగ్నమై ఉండటం ప్రశంసనీయం.ఈ నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించిన వెంటనే క్షేత్ర పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం విశేషం. ఆమెతో పాటు అనుభవజ్ఞుడైన వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కమిషనర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్ గంగాధర్, మేనేజర్ బాల గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మహేశ్ సమన్వయంతో సమగ్ర కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాల ముందు గోదావరి తీరాన్ని శుభ్రపరచడం అత్యవసరమని భావించి ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు.

మంగళ వారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యక్షంగా పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజా ప్రతినిధి స్వయంగా పాల్గొనడం ద్వారా పారిశుద్ధ్యంపై ప్రభుత్వ కట్టుబాటును చాటారు. దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ నేతృ త్వంలోని ధర్మకర్తల మార్గదర్శకత్వంలో, ఈఓ శ్రీనివాస్ సమన్వయంతో... కార్యక్రమం సమన్వయంతో సాగింది. మున్సిపల్ సిబ్బంది, లయన్స్ క్లబ్ బాధ్యులు, స్థానిక స్వచ్ఛంద సేవకులు కలసి వి.ఐ.పి ఘాట్, మంగలి గడ్డ ప్రాంతాల్లో విస్తృత శుభ్రతా చర్యలు చేపట్టారు.

గోదావరి తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూజా సామగ్రి అవశేషాలు, పాడైన వస్త్రాలు తొలగించబడ్డాయి. తీర ప్రాంతాన్ని యంత్రాలతో, మానవ శ్రమతో శుభ్రపరిచారు. చెత్తను వేరు చేసి పారవేయడం, పునర్వినియోగం అయ్యే పదార్థాలను ప్రత్యేకంగా సేకరించడం వంటి చర్యలు చేపట్టడం గమనార్హం. కేవలం ఒకరోజు శుభ్రతతో సమస్య పరిష్కారం కాదని తెలుసుకున్న నిర్వాహకులు, ఉత్సవాల మొత్తం వ్యవధిలో నిరంతర పర్యవేక్షణకు ప్రణాళిక సిద్ధం చేశారు.



ఈ శుభ్రతా కార్యక్రమం ప్రజల్లో చైతన్యం రేకెత్తించింది. మున్సిపల్--దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛంద సేవలను పుర ప్రజలు, భక్తులు ఎంతగానో ప్రశంసించారు. భక్తి అంటే కేవలం పూజలు, హారతులు మాత్రమే కాదని; పవిత్ర ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడం కూడా భక్తి భాగమని పలువురు పేర్కొన్నారు. గోదావరిని తల్లి గా భావించే మన సంస్కృతిలో ఆమెను కలుషితం చేయడం ఆధ్యాత్మికంగా, సామాజికంగా అనర్థమని బోధించే ప్రయత్నం ఇది.
పర్యావరణ పరిరక్షణ నేటి కాలంలో అత్యంత కీలక అంశం. నదులు కేవలం ఆధ్యాత్మిక కేంద్రములు మాత్రమే కాదు; అవి జీవ వైవిధ్యానికి, త్రాగునీటి వనరులకు, వ్యవసాయానికి మూలాధా రాలు. గోదావరి వంటి మహానది కలుషితం అయితే దాని ప్రభావం దిగువ ప్రాంతాల వరకు వ్యాపిస్తుంది. ఉత్సవాల సమయంలో తాత్కాలిక చెత్త పెరుగుదల మాత్రమే కాదు; రసాయనిక పదార్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలో కలవడం దీర్ఘకాలిక ప్రమాదాలకు దారితీస్తుంది. కాబట్టి బ్రహ్మోత్సవాల సందర్భాన్ని పర్యావరణ చైతన్యానికి వేదికగా మార్చుకోవడం సమయోచితం.
ఈ దిశగా కొన్ని దీర్ఘకాలిక చర్యలు అవసరం. ఘాట్ల వద్ద ప్రత్యేక చెత్త బుట్టలు ఏర్పాటు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం, పూజా సామగ్రి కోసం ప్రత్యేక సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం, దీక్షా వస్త్రాల కోసం వేరు సిమెంట్ కుండీలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు అమలు చేయాలి. జంతు బలుల వంటి సంప్రదాయాలను నియంత్రించే దిశగా చట్టపరమైన మార్గదర్శకాలు పాటించాలి. పూజా అవశేషాలను నదిలో కాకుండా కంపోస్టింగ్ కేంద్రాలకు తరలించే విధానం అమలు చేయాలి. భక్తుల అవగాహన అత్యంత ముఖ్యమైన అంశం. ఆలయ ప్రాంగణంలో, ఘాట్ల వద్ద స్పష్టమైన సూచన బోర్డులు ఏర్పాటు చేయాలి. మైక్ ప్రకటనల ద్వారా పరిశుభ్రతపై సందేశాలు ఇవ్వాలి. విద్యార్థి వాలంటీర్లను, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య బృందాలు ఏర్పాటు చేయాలి. మున్సిపల్--దేవస్థానం సమన్వయం నిరంతరం కొనసాగాలి.

నూతన మున్సిపల్ పాలకవర్గం చేపట్టిన ఈ చర్యలు మంచి ఆరంభంగా భావించవచ్చు. కానీ ఇది ఒకరోజు కార్యక్రమంగా ముగియ కూడదు. బ్రహ్మోత్సవాల అనంతరం కూడా గోదావరి తీర పరిశుభ్రతపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరం. ప్రజల సహకారం లేకుండా ఏ చర్యలు ఫలవంతం కావు. కాబట్టి ప్రతి భక్తుడు, ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించాలి.ధర్మపురి బ్రహ్మోత్సవాలు భక్తి వైభవానికి ప్రతీక. ఆ వైభవం పరిశుభ్రతతో కలిసినప్పుడే నిజమైన పుణ్య ఫలితం లభిస్తుంది. పవిత్ర గోదావరి తీరంలో జరిగే ప్రతి హారతి, ప్రతి ఊరేగింపు, ప్రతి సేవ కార్యక్రమం పర్యావరణ స్నేహపూర్వకంగా ఉండాలి. దేవుని ఆరాధనతో పాటు ప్రకృతి ఆరాధన కూడా సమానంగా ఉండాలి. గోదావరి తల్లి స్వచ్ఛంగా, నిష్కళంకంగా ప్రవహించాలంటే మన సంస్కారాల్లో మార్పు అవసరం.
ఈ బ్రహ్మోత్సవాలు కేవలం ఉత్సవాలే కాకుండా ఒక సంకల్ప ఘట్టంగా మారాలి–"పవిత్ర క్షేత్రం, పరిశుభ్ర గోదావరి" అనే నినాదంతో ముందుకు సాగాలి. భక్తి, బాధ్యత, పరిశుభ్రత–ఈ మూడు కలిసినప్పుడే ధర్మపురి క్షేత్రం తన సంపూర్ణ మహిమను నిలుపు కుంటుంది. నూతన మున్సిపల్ నాయకత్వం, దేవస్థానం, స్వచ్ఛంద సంస్థలు, భక్తులు కలిసి పనిచేస్తే ధర్మపురి గోదావరి తీరం మరోసారి నిజమైన పుణ్యక్షేత్రంగా ప్రకాశిస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**
**..9440595494**

# దుర్మార్గానికి పాల్పడ్డ డీఎస్పీ, సిఐ,ఎస్ఐని డిస్మిస్ చేయాలి





**పార్టీ పక్షాన ఐదు లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తాం**
**మరియమ్మ లాకప్ డెత్ కేసులో బాధిత కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా నిలబడింది**
**రాజేష్ కుటుంబానికి న్యాయం జరగకపోతే జాతీయస్థాయిలో ఉద్యమానికి శ్రీకారం చుడతాం**

**కోదాడ (సింగిడి):** కర్ల రాజేష్ కుటుం బానికి న్యాయం జరగకపోతే జాతీయస్థాయిలో ఉద్యమానికి శ్రీకారం చుడతానని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం కోదాడ పట్ట ణంలో ఇటీవల లాకప్ డెత్ లో మృతి చెందిన కర్ల రాజేష్ కుటుంబాన్ని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, గాదారి కిషోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లతో కలిసి తల్లి లలితమ్మను ఆయన పరామ ర్శించారు. రాజేష్ మృతికి కారకులైన పోలీసు యంత్రాం గంపై చర్యలు తీసుకోకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిని ఎందుకు కాపాడుతున్నారో జవాబు చెప్పా లన్నారు. దుర్మార్గానికి ఒడిగట్టిన డిఎస్పి, సిఐ,ఎస్ఐ లను విధుల నుండి సస్పెండ్ చేయాలన్నారు. డీఎస్పీపై చర్యలు తీసుకోకుండా స్థానిక మంత్రి సివిల్ సప్లై శాఖలో పదోన్నతి కల్పించడం వెనకాల ఆంతర్యం ఏమిటి అన్నారు. తమ ప్రభు త్వ హయాంలో లాక్ అప్ డెత్ లో మృతి చెందిన మరియమ్మ కేసులో పూర్తి న్యాయం చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాజేష్ కుటుంబాన్ని తీవ్రఅన్యాయానికి గురి చేసిందని ఆవే దన వ్యక్తం చేశారు. పార్టీ పక్షాన బాధిత కుటుంబానికి ఐదు లక్షల సహాయాన్ని ప్రకటించారు.

భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ కర్ల రాజేష్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజేష్ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రజా సంఘాలకు వివిధ రాజకీయ పక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాజేష్ తల్లితో కలిసి రాజేష్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా కేటీఆర్ ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎంఆర్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమాన్ని ఆకాంక్షించే
# కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ జిల్లా పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**జనగామ జిల్లా అభివృద్ధిలో, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషించిన కలెక్టర్**
**27న జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్న రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల ప్రతినిధిఫిబ్రవరి (సింగిడి):** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడంలో ముందుం డటమే కాక ప్రజల సమస్యలను ఎప్పటిక ప్పుడు పరిష్కరిస్తారని పేరుగాంచిన అధికారి రిజ్వాన్ బాషా షేక్. జనగామ జిల్లా కలెక్టర్ గా రిజ్వాన్ బాషా షేక్ రెండేళ్లు పూర్తి చేసుకుని జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈనెల 27న జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్న రిజ్వాన్ బాషా షేక్ తన విధి నిర్వహణలో అంకితభావం కలిగిన అధికారిగా పేరుగాంచారు.

అక్షరాస్యతలో జోగులాంబ గద్వాల జిల్లా వెనకబడి ఉండడంతో కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న కలెక్టర్ ఈ ప్రాంతంలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించడమే కాక అన్ని రంగాల్లో గద్వాల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తార నడంలో అతిశయోక్తి లేదు. జనగామ జిల్లా కలెక్టర్ గా సంక్షేమ పథకాల అమ లులో చేసిన విశేష సేవలు, అందుకున్న పురస్కారాలు ఆయన ప్రతిభకు తార్కాణా లుగా చెప్పవచ్చు. కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జనగామ జిల్లాలో సాధించిన ప్రగతి, అందుకున్న పురస్కారాలు ఆయన నిబద్ధతకు కొలమానాలుగా చెప్పవచ్చు.



కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జనగామ జిల్లాలో "మన జిల్లా – మన నీరు" అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మా ణాలకు శ్రీకారం చుట్టి విజయవంత మయ్యారు.

ఈ క్రమంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2025, నవంబర్ 18న దిల్లీలో జరిగిన 6వ జాతీయ జల అవార్డుల కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ. ఆర్. పాటిల్ చేతుల మీదుగా జల్ సంచాయ్ – జన్ భాగీధారీ 1.0 అవార్డు, అలాగే జల్ ప్రహరీ సమ్మాన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సైతం అందుకున్నారు.

అలాగే జనగామ జిల్లాలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అమలులో ప్రతిభ చూపినం దుకు గాను 2025, అక్టోబర్ 9న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అందుకున్నారు.

అలాగే ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సిబ్బందికి నైపుణ్యాలను పెం పొందించడం ద్వారా ఎన్నికల నిర్వహ ణను అధికారులు సక్రమంగా, పారదర్శ కంగా నిర్వహించినందుకు గాను 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరిం చుకొని 2026, జనవరి 25న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా పురస్కారాన్ని కూడా కలెక్టర్ పొందడం జరిగింది.

దేశవ్యాప్తంగా జాతీయస్థాయిలో నిర్వహించిన నాస్ (నేషనల్ అచీవ్మెంట్ సర్వే) – 2024 సర్వేలో జనగామ జిల్లా విద్యార్థులు తృతీయ తరగతిలో 16వ స్థానం, ఆరవ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతిలో 33వ స్థానం సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం జనగామ జిల్లా విశిష్ట స్థానం సాధించడంలో విశేష కృషి చేసినందున 2025, సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అవార్డును అందుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను జనగామ జిల్లాలోని నిరుపేదలకు అందించేందుకు తరచు ఆయా ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటనలు చేసేవారు, వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించేవారు. జనగాం జిల్లాను రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ అంశాల్లో ముందంజలో నిలబడేలా చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీపై రావడం గర్వకారణంగా భావించవచ్చు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంకు గట్టు మండలం ఎంపిక కావడంతో నిర్దేశించిన అంశాల్లో 100% లక్ష్యాలను సాధించేందుకు కొత్త కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెడతారని చెప్పవచ్చు. అలాగే జిల్లాను అన్ని రంగాల్లో ముందుండేలా ఇక్కడి ప్రజాప్రతినిధులను, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పారదర్శకమైన పాలనతో గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# వార్డు అభివృద్ధే లక్ష్యంగా దూసుకెళ్తున్న కౌన్సిలర్

## గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా...
## పార్టీలకు అతీతంగా అభివృద్ధి: బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి గుర్రం కావ్య పరశురాం

**జమ్మికుంట,(సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన గుర్రం కావ్య పరశురాం అభివృద్ధి పనులు వేగం పెంచుతూ వార్డును శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజకీయాలంటే వ్యాపారం కాదని సేవ అని నమ్మి నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ నుండి బరిలోకి దిగిన కావ్య పరశురాం ను 20వ వార్డు ప్రజలు అక్కున చేర్చుకొని గెలిపించారు.

గెలిపించిన ప్రజలను తీర్చుకోవాలని సమస్య ఎక్కడ ఉన్న అక్కడికి వెళ్లి పరిష్కారం చూపే దిశగా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం 20వ వార్డులో పేరుకుపోయిన చెత్తను నిండుకున్న డ్రైనేజీని శుభ్రం చేస్తూ మున్సిపల్ సిబ్బందికి వారు సూచనలు చేస్తూ పనులను చేయించారు. అంతేకాకుండా చీకటి పడితే రోడ్డుపై నడవడానికి స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది అధికారుల




దృష్టికి తీసుకువెళ్లి వార్డులో లైట్లను అమర్చి వార్డు ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ సందర్భంగా గుర్రం కావ్య పరశురాం మాట్లాడుతూ, మాకు మేలు చేస్తారని కష్టాల్లో ఆదుకుంటారని నమ్మి మమ్మల్ని గెలిపించిన 20వ వార్డు ప్రజల రుణం తీర్చుకుంటామని సాధ్యమైనంతవరకు వారికి సేవ చేయడమే మా లక్ష్యం అని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మాకు సహకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ తో పాటు మున్సిపల్ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వార్డును ఆదర్శ వార్డుగా తయారు చేస్తానని తెలిపారు.

# రహదారి భద్రతకు కంటిచూపు కీలకం...

## ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలి : కరీంనగర్ సిపి గౌస్ అలాం

**జమ్మికుంట, (సింగిడి):** రహదారి భద్రతకు కంటిచూపు అత్యంత కీలకమని కరీంనగర్ సిపి గౌస్ అలాం అన్నారు. జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్ లో కరీంనగర్ సిపి గౌస్ అలాం ఆదేశాల మేరకు మోటార్ వాహనాల డ్రైవర్లకు ఉచిత వైద్య కంటి శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపి గౌస్ అలాం శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జమ్మికుంట పట్టణానికి చెందిన నేత్రా వైద్య కంటి నిపుణులతో పాటు మరి కొంతమంది వైద్య నిపుణులు కలిసి హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవర్లు ఆటో డ్రైవర్లు ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి సిపి గౌస్ అలాం చేతుల మీదుగా కళ్ళజోడు ను పంపిణీ చేశారు. సందర్భంగా సిపి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు కంటి చూపు త్యంతకీలకమైనటువంటిదని కంటి చూపు సరిగా లేనప్పుడు వాహనాలు సరిగా నడపకపోవడంతో ప్రమాదాల బారిన పడే అవకాశాలు




ఉన్నాయని ప్రతి ఒక్క డ్రైవర్ కంటి పరీక్షలను చేసుకొని వారి ప్రయాణాన్ని సుగమం చేసుకునే విధంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత పాటించడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని దూరాలవాట్లకు దూరంగా ఉండి మద్యపానం సేవించకుండా వాహనాలు నడిపి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజరాబాద్ ఏసిపి మాధవి, సీఐలు లక్ష్మీనారాయణ, రామకృష్ణ గౌడ్, వీణవంక, హుజురా బాద్ కేశవపట్నం ఎస్సైలు వేద కంటి వైద్యశాల డాక్టర్ సాయి నేత్ర తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం
# బీసీలకు 50 వేల కోట్లు కేటాయించాలి
## బీసీ సబ్ ప్లాన్ వెంటనే ఏర్పాటు చేయాలి



**ఆర్మూర్, (సింగిడి):** : వచ్చే బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 50 వేల కోట్లు కేటాయించాలని, అదేవిధంగా బీసీ సబ్ ప్లాన్ వెంటనే అమలు పరచాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీసీలు ముందుండి నీళ్లు, నియామకాలు, నిధులు అనే సిద్ధాంతం పై ఉద్యమాలను నిర్వర్తించి ప్రాణాలను సైతం త్యాగం చేసి తెలంగాణను సాధించింది బీసీ లేదని ఆయన అన్నారు. గత పది సంవత్సరాల తెరాస పాలనలో బీసీలకు 20 శాతం నిధులను సైతం ఖర్చు చేయలేదని ఆయన టిఆర్ఎస్ ప్రభుత్వం మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధత కల్పిస్తామని, అంతేకాకుండా ప్రతి సంవత్సరం బడ్జెట్లో బీసీలకు 20 వేల కోట్లు కేటాయించి, ఐదు సంవత్సరాలలో బీసీలకు ఒక లక్ష కోటి రూపాయల బడ్జెట్ తో బీసీలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని, మాయ మాటలు చెప్పి, అధికారంలోకి వచ్చి 26 నెలలు గడిచిన గాని, 2023 = 24 లో 20000 కోట్లు కేటాయించి, 2024 = 25 లో, 20 వేల కోట్లు బడ్జెట్ కేటాయించి, బీసీలకు ఖర్చు చేసింది మాత్రం కేవలం 5000 కోట్లు మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. 2024- 25 లో నిరుద్యోగులకు రాజీవ్ యువశక్తి పథకం, బ్యాంకుల ద్వారా రుణాలు అందించి యువతను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తామని చెప్పి, ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. బీసీల మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కక్ష సాధింపు చేపడుతుందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో 6వ శాతం బి.సి.జనాభా కలిగి ఉన్న బడ్జెట్లో బీసీల పట్ల ఎందుకు ఖర్చు చేయడం లేదని ఆయన అన్నారు. కనీసం వచ్చే బడ్జెట్ సమావేశంలోపు రాజీవ్ యువశక్తి పథకం ద్వారా బిసి నిరుద్యోగులకు రుణాలు అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. అంతేకాకుండా రానున్న బడ్జెట్లో 50వేల కోట్లు కేటాయించి, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి, బీసీల అభివృద్ధికి, నిరుద్యోగుల కు ఉపాధి కల్పిస్తూ అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## టిఆర్ఎస్ నాయకుడి జన్మదిన వేడుకలు



**అల్వాల్, (సింగిడి):** వెంకటాపురం వాస్తవ్యులు బి ఆర్ ఎస్ నాయకులు అభిషేక్ రావు జన్మదినము పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంనకు మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు అరవింద్ కుమార్, అభిషేక్ రావుఇటీవలనేరోడ్డు యాక్సిడెంట్ లో మరణించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## 103 కిలోల అధిక బరువున్నా మహిళకు శస్త్ర చికిత్స

**ప్రైవేటు ఆసుపత్రిలకు దీటుగాప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్లు**
**పేదలకు వరంగా మారిన ప్రభుత్వ ఆసుపత్రి**

**పెద్దపల్లి (సింగిడి):** ముత్తారం మండలానికి చెందిన ఒక 45 సం,రాల మహిళ తీవ్రమైన కడుపు నొప్పి,తీవ్రరక్తస్రావం తో బాధ పడుతూ,ముత్తారం మాజీ జడ్పిటిసి ని సంప్రదిం చగా,తక్షణమే స్పందించి వారు ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లారు.మేరకు మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని సదరు పేషెంట్ ను డా శ్రీధర్ డి.సి.హెచ్.ఎస్, పెద్దపల్లి మాతాశిశు ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. ఈ పేషెంట్ కి గర్భ కోశం లో ప్రాబ్లం ఉందని గుర్తించి,అవసరం ఉన్న



పరీక్షలు అన్ని నిర్వహించారు. ఈ పేషెంట్ 103 కిలోల అధిక బరువు కలిగి ఉంది,ఇది చాలా కష్టతరమైన ఆపరేషన్ అయిన కూడా అత్యంత నైపుణ్యం, అనుభవం ఉన్న డా.బి. శ్రీనివాస్ హైదరాబాద్ నుంచి పిలిపించి ఈ రోజు ఆ మహిళకు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించడం నిర్వహించారు.తరచూ గా హై రిస్క్ ఆపరేషన్స్ నిర్వహించడం లో ముందున్న వైద్యులను మరియు ఆసుపత్రి సూపరింటెండెంట్ ని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష అభినందించారు. అలాగే పెద్దపల్లి ఆసుపత్రి లో అందుతున్న సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఒక ప్రకటన లో తెలిపారు.

# భూదాన్ నిర్వాసితులకు కమ్యూనిస్టుల భరోసా

**బాధితులను పరామర్శించిన సిపిఐయం**
**రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

**ఖమ్మం, (సింగిడి):** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామ పరిధిలో గల భూదాన భూములలో ఇండ్లు లేని నిరుపేదలు సుమారు 1000 కుటుంబాలు గత కొన్ని సంవత్సరాలుగా ఇండ్లు కట్టు కుని నివసిస్తున్నట్టి ఇండ్లను రెండు రోజు ల క్రితం రెవెన్యూ, మునిసిపల్ సిబ్బంది సంయుక్తంగా నివాసితులను ఖాళీ చేయిం చి, ఇండ్లను ధ్వంసం చేయడం జర్గింది. ప్రభుత్వం పోలీస్, సిఆర్పిఎఫ్ బలగాలను మోహరించి అక్కడ నివాసితులకు భయాభ్రాంతులకు గురిచేసి కూల్చివేతల దుశ్చర్యకు పాల్పడి బాధితులకు అంబేద్కర్ భవన్ కు తరలించడం జర్గింది. .

ఖమ్మం జిల్లా వెలుగు మట్ల భూదాన భూముల్లో జర్గిన విషాదకర ఘటనను ఖం డిస్తూ గురువారం రోజున జిల్లాకు చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు స్థానిక అం బేద్కర్ భవన్కు వెళ్ళి భూనిర్వాసిత బాధి తులను పరామర్శించారు. సిపిఐ యం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్ రావ్, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐయం మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేని వెంకటేశ్వర్లు, మధు బాధితులను పరామర్శించి అండగా వుంటామని తెలిపారు.

సిపిఐయం రాష్ట్రకార్యదర్శి వర్గస భ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ వెలుగు మట్ల ఘటన చాలా అమానుషం అన్నారు. నిరుపేదల కు ఇండ్లు లేని వారికి వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని అట్టి భూములకు పట్టాలు వున్నాగానీ రెవెన్యూ



రికార్డులలో నవమోదు లేదని, దౌర్జన్యంగా వందల మందిని ఇండ్లలో నుంచి ఖాళీ చేయించి ఇండ కూల్చివేత అమానుషచర్యగా పేర్కొన్నారు. వారికి తిరిగి ఇండ్లను నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని వారికి తిరిగి ఇండు ఇచ్చేవరకు అన్ని కమ్యునిస్టు పార్టీలు కలిసి పోరాడతామని అన్నారు.

అనంతరం జిల్లా కలెక్టరేట్ కు వెళ్ళి కలెక్టర్తో ఇండ్ల కూల్చివేత ఘటనపై సిపి ఐయం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్ రావ్ బాధితులను ఆయనకో వాలని వినతి పత్రానే అందించి, చర్చిం చటం జర్గింది. చర్చల్లో భూ నిర్వాసితులకు తిరిగి ఇండ్లను నిర్మించి ఇవ్వాలని, వారికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. అందుకు సానుకూలంగా స్పంది స్తూ కలెక్టర్ తగు న్యాయం చేస్తామని హామి ఇవ్వడం జర్గింది. తదుపరి వెలుగు మట్ల సంఘటనా స్థలికి వెళ్ళి బాధితుల కూల్చిన ఇండ్లను నష్టాన్ని అంచనా వేయ డం జర్గింది. ఈ సందర్భంగా బాధితులను పరామర్శిస్తూ సిపి ఐయం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్ రావ్ మాట్లాడుతూ అధికారుల దౌర్జన్యం నిరుపేదల మీద ఇండు లేని వారి పట్ల సరైనది కాదని ఇండ్లు లేని వారికి స్వంత ఇండ కలనేర్చే ప్రభుత్వం మాదే అంటూ కాంగ్రెస్ ప్రభు త్వం ఈ రకంగా పేదలపై దాడి హేయ మైన చర్య అని ఖండించారు. ఇండు నష్ట పోయిన బాధితుల పట్ల సిపిఐయం పార్టీ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ వెంటనే నష్టపోయిన బాధితులకు అక్కడే ఇండ్లను నిర్మించి ఇవ్వాలని లేని పక్షంలో డబుల్ బెడ్రూమ్, ఇందిరమ్మ ఇళ్ళ జాబితాలో వారికి ఇండు కేటాయిం చాలని అదే విధంగా ప్రతి ఇంటికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం తక్ష ణమే ప్రకటించాలని ఈసందర్భంగా డిమాండ్ చేసారు.ప్రభుత్వం ఈ విష యంలో భయ నిర్వాసితులకు పునర్ నివా సం కల్పించుటలో జాప్యం చేస్తే భవిష్య త్తులో సిపిఐయం జిల్లా పార్టీ ఇతర కమ్యూ నిస్టు పార్టీలను కలుపుకొని పోరాటం ఉధృతం చేసి వారికి ఇండ్లను ఇచ్చేలా కార్యచర్య ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు నున్నా నాగేశ్వరరావు,వైవిక్రమ్, సింగు నరసింహా రావు, మాచర్ల భారతి, పొన్నం వెంకటేశ్వర రావు, ఎర్రా శ్రీనువాసరావు, మెరుగు సత్యనారాయణ, దొంగల తిరు పతిరావు నందిపాటి మనోహర్, భూక్య శ్రీనివాస రావు, ఎస్. నవీన్ రెడ్డి, పిన్నింటి రమ్య, బోడపట్ల సుదర్శన్ నాగుల్ మీరా, బత్తిని ఉపేందర్, రామయ్య, సాంబశివ రెడ్డి, తదితర వామపక్ష నేతలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్

**మల్కాజిగిరి,(సింగిడి):** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ లోని లైఫ్ హాస్పిటల్ దగ్గర సుమారు 30 లక్షల తో సీసీ రోడ్డు పనులను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, ముత్యం రెడ్డి, జాన్, కాశి రెడ్డి, వై బి ఆర్ కె ప్రసాద్, పద్మావతి, మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



## మై భారత్తో యువజన సంఘాలు అనుసంధానం కావాలి

**యువజన సంఘాలకు ప్రోత్సాహకంగా**
**స్పోర్ట్స్ కిట్లు పంపిణీ: జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి**



**దుబ్బాక (సింగిడి):** యువత సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా (మై భారత్) ఆధ్వర్యంలో యువజన అభివృద్ధి కార్యక్ర మాలు వేగవంతం చేయబడుతున్నాయని జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి తెలిపారు.గురువారం సిద్దిపేట జిల్లా పరిధిలోని దుబ్బాక బ్లాక్, అక్బర్పేట్--భూంపల్లి మండల కేంద్రాల్లో యువ జన సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, మై భారత్ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ కార్యా చరణపై చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ గ్రామాలకు చెందిన యువజన సంఘాలను మై భారత్తో అనుసం ధానం చేయడం జరుగుతోందని తెలిపారు. అలాగే సంఘాలు ఏర్పాటు కాలేని గ్రామాల్లో కొత్త యువజన సంఘాలను ఏర్పాటు కు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యువజన సంఘాలకు ప్రోత్సాహకంగా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా యువ జన అధికారి వెల్లడించారు. యువత క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సర్పంచ్ కుమార్ కార్యదర్శి అర్జున్,జిల్లా యూత్ అవార్డీ రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలు మానసిక
# ప్రశాంతతకు నిలయాలు


**దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న సొంతి రెడ్డి పున్నారెడ్డి.**




**కుత్బుల్లాపూర్, (సింగిడి):** : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ పిపినగర్లో గల ఆంజనేయ స్వామి, గణపతి , శివలింగం, నాగదేవత , నవగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సొంటి రెడ్డి పున్నారెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా ఉండే విధంగా దేవాలయాల పరిసరాలను ప్రశాంత వాతావరణం కల్పించే విధంగా అందమైన పూల మొక్కలు పెంచాలని సూచించారు.

## మున్సిపల్ కార్మికుల
# సిఐజీ గ్రూపులను కొనసాగించాలి

**టీయూసిఐ, సిఐటియూ, ఎఐటియూసి సంఘాల డిమాండ్**



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** : మున్సిపల్ కార్మికుల సిఐజి గ్రూపులను కొనసాగించాలని, ఏజెన్సీ కార్మికు లతో కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ టీయుసీఐ, ఎఐటియుసి, సిఐటియు సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ ని కలిసి వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ. రమేష్ బాబు లు మాట్లా డుతూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగంలో ఔట్సోర్సింగ్ కార్మికులతో ఇప్పటికే కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు (సిఐజి) ఉన్నాయన్నారు. ఇవి కాకుండా ఔట్సోర్సింగ్ ఏజెన్సీలో 330 మంది కార్మికులు ఉన్నారన్నారు. ఇప్పటికే ఉన్న సిఐజి గ్రూపులను రద్దుచేసి కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలనుకోవడం సరైంది కాదన్నారు. అందువల్ల పనిభారం పెరుగుతుందన్నారు. ఇప్పటికే ఉన్న సిఐజి గ్రూపులను కొనసాగిస్తూ, అవుట్సోర్సింగ్ ఏజెన్సీ 330 మంది కార్మికులను 20 నుండి 25 మందితో ఒక గ్రూపుగా ఏర్పాటు చేయాల న్నారు. మున్సిపల్ కమిషనర్ గారు సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ యూనిఫామ్ సబ్బులు నూనెలు రక్షణ పరికరాలు ఇవ్వాలని, కేటగిరీల వారీగా ఇతర మున్సిపల్ కార్పొరేషన్ లో ఇస్తున్నట్లు వేతనాలు చెల్లించాలని మరియు పిఎఫ్ ఈఎస్ఐలలో ఉన్న తప్పులను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు రాజేశ్వర్, కిరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిద్ర లేకపోతే బాడీ షెడ్డుకేనట..

### ఈ రోగాలు రాకముందే జాగ్రత్త పడండి..

నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది నిద్రలేమిని ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట మొబైల్ ఫోన్ వాడకం, నిరంతరం స్క్రీన్ సమయం, ఒత్తిడి, రోజువారీ దినచర్యలు సరిగా లేకపోవడం, ఆలస్యంగా భోజనం చేయడం, షిఫ్ట్ పని, మానసిక ఒత్తిడి ఇవన్నీ నిద్రను ప్రభావితం చేస్తాయి.

కొంతమంది పనిభారం కారణంగా సమయానికి నిద్రించడానికి ఇబ్బంది పడుతుండగా.. మరికొందరు ఆందోళన, అతిగా ఆలోచించడం వల్ల నిద్రపోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అధిక కెఫిన్ వినియోగం, రాత్రిపూట టీవీ చూడటం, నిర్ణీత సమయంలో నిద్రపోకపోవడం కూడా ప్రధాన కారణాలని.. వైద్య నిపుణులు చెబుతున్నారు.

అటువంటి పరిస్థితిలో, నిద్ర లేకపోవడం క్రమంగా ఒక అలవాటుగా మారుతుంది.. ఇది శరీరం సహజ నిద్ర సమతుల్యతను దెబ్బతీస్తుంది. శరీరానికి విశ్రాంతి ఇవ్వడానికి, మనస్సును రిఫ్రెష్ చేయడానికి, కణాలను రిపేర్ చేయడానికి తగినంత.. మంచి నిద్ర అవసరమని భావిస్తారు. తగినంత నిద్ర లేనప్పుడు, శరీరం, మనస్సు రెండూ ప్రభావితమవుతాయి. ఇది అనేక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. అవేంటో మరింత తెలుసుకుందాం..

**నిద్ర లేకపోవడం వల్ల ఏ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది?**



లేడీ హార్డింజ్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్, నూణ డాక్టర్.ఎ. ఘోటేకర్ వివరిస్తూ.. దీర్ఘకాలిక నిద్ర లేమి అనేక తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల శరీరంలో హార్మోన్ల అసమతుల్యత కూడా ఏర్పడుతుంది.. ఇది ఊబకాయానికి దారితీస్తుంది.
బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కూడా ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని పెంచుతుంది. దీర్ఘకాలిక నిద్ర లేమి నిరాశ, ఆందోళన -- జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల, నిద్రను నిర్లక్ష్యం చేయడం ఆరోగ్యానికి హానికరం.

**లక్షణాలు ఏమిటి?**
నిద్ర లేమి లక్షణాలు క్రమంగా కనిపిస్తాయి. సాధారణ సంకేతాలలో రోజంతా అలసట, చిరాకు, తలనొప్పి, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బంది, ఏకాగ్రత లేకపోవడం వంటివి ఉంటాయి. తరచుగా ఆవలించడం, కళ్ళు బరువెక్కడం కూడా లక్షణాలు కావచ్చు. కొంతమందికి జ్ఞాపకశక్తి కోల్పోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది కూడా ఉంటుంది. దీర్ఘకాలిక నిద్ర లేమి ఒత్తిడి -- మానసిక స్థితిలో మార్పులను పెంచుతుంది.

**దాన్ని ఎలా నివారించాలి?**
తగినంత నిద్ర పొందడానికి, ప్రతిరోజూ ఒకే సమయంలో పడుకోవడం, మేల్కొవడం అలవాటు చేసుకోండి. పడుకునే ముందు మొబైల్ ఫోన్లు, టీవీ చూడటం మానుకోండి. తేలికపాటి భోజనం తినండి.. కెఫిన్ తీసుకోవడం పరిమితం చేయండి. మీ నిద్ర వాతావరణాన్ని నిశ్శబ్దంగా, సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.. కానీ పడుకునే ముందు కఠినమైన వ్యాయామాన్ని నివారించండి. ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం లేదా యోగా ప్రయత్నించండి.

## లోపాలకు చెక్... బ్రహ్మోత్సవాలపై యంత్రాంగం ఫుల్ రెడీ

### జాతరపై పరిపాలనా ముద్ర... అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి





**ధర్మపురి (సింగిడి):** ధర్మపురి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తోంది. జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నేటి నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మిగిలిన పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కఠిన ఆదేశించారు.

**ఘాట్‌లు, దేవాలయ ప్రాంగణం, కోనేరు పరిశీలన**
గోదావరి నది తీర ప్రాంతాలు, దేవాలయ ప్రాంగణం, కళ్యాణ మండపం, కోనేరు, ఇసుక స్తంభం తదితర ప్రాంతాలను కలెక్టర్ బి సత్యప్రసాద్స్వయంగా సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రతా చర్యలు, బారికేడ్లు, తాత్కాలిక పార్కింగ్ స్థలాలు, త్రాగునీరు మరియు విద్యుత్ సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని సూచించారు. "ఏ శాఖకు కేటాయించిన పనులు అవి పూర్తయ్యే వరకు నిర్లక్ష్యం ఉండకూడదు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలి" అని అధికారులకు స్పష్టం చేశారు.



**సమన్వయ సమావేశం... శాఖలకు ప్రత్యేక బాధ్యతలు**
అనంతరం ధర్మపురి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్‌తో కలిసి కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రవాణా, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. భక్తుల కోసం వేర్వేరు పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని సూచించారు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారు లను ఆదేశించారు. 24 గంటల శానిటేషన్ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. తాత్కాలిక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల సేవల వినియోగం ద్వారా వచ్చే భక్తుల కు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించామని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే వేడుకలు విజయవంతమవుతాయని కలెక్టర్ తెలిపారు.

**భక్తులకు సౌకర్యాలే ప్రాధాన్యం**
బ్రహ్మోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుభ్రత, భద్రత, వైద్య సదుపాయాలు, త్రాగునీరు, క్రమబద్ధమైన దర్శనం -- ఈ ఐదు అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. లోటుపాట్లు గుర్తించిన వెంటనే అధికారులతో సమీక్ష సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ పరిశీలన మరియు సమావేశంలో ఆర్డీవో, డీఆర్డీఓ, డీపీఆర్ఓ, ఈఈ ఆర్డబ్ల్యూఎస్, సంబంధిత జిల్లా అధికారులు, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న కౌన్సిలర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ మరియు సభ్యులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, దేవస్థాన ఈవో సంకటాల శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ ధర్మపురి ఎంపిడివో పాల్గొన్నారు.

## రజకులపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

### తిమ్మాపూర్,పద్మనాభునిపల్లి రజక సంఘం అధ్యక్షులు మార్కంటి మైసయ్య, కంచర్ల రమేష్




**దుబ్బాక (సింగిడి):** రజకులపై దాడి చేసిన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి రజక సంఘం అధ్యక్షులు మార్కంటి మైసయ్య, కంచర్ల రమేష్ డిమాండ్ చేశారు. కర్నూల్ జిల్లా కొమ్మెరలో నిర్వహించిన శ్రీ మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో జరిగిన దాడిలో రెండు నెలల బాలిక మృతి చెందిన ఘటనపై నిరసనగా తిమ్మాపూర్ ప్రధాన చౌరస్తా నుండి గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి వెళ్ళకుండా నిర్వాహకులు అడ్డుకోవడం దారు ణమన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మనాభ నిపల్లి మాజీ సర్పంచ్ ముక్కపల్లి శ్రీనివాస్, ఉపసర్పంచ్ రుద్రారం యాదగిరి,తిమ్మాపూర్ మాజీ ఉప సర్పంచ్ బాబు, రజక సంఘం నాయకులు మార్కంటి కనకయ్య, కూమర స్వామి, నరేష్, ధర్మయ్య, సాగర్, విక్రమ్, సైదుగారి నారా యణ, గుర్రాల సుబ్బు, వివిధ కూల సంఘాల నాయకులు, బహుజన సంఘాల యువత తదితరులు ఉన్నారు.

## పిఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు ఎన్ సిసి మంజూరు



**కొడంగల్, (సింగిడి)::** పిఎం శ్రీ జడ్పి హెచ్ ఎస్ బొంరాస్ పేట్ పాఠశాల కు ఎన్ సిసి మంజూరు అయినట్లు మండల విద్యాధికారి ఎన్. హరి లాల్ తెలిపారు. ఎన్ సిసి ద్వారా క్రమ శిక్షణ, ఆత్మ విశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్ష ణాలు అలవడతాయని, ఉద్యోగ, ఉపాధి అవకా శాలలో ఎన్ సిసి సర్టిఫికెట్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని, విద్యార్థులు, తల్లిదండ్రులు సహక రించి ఎన్ సిసి లో చేరాలని ఆయన అన్నారు. ఈసందర్భంగా మండల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉద్యోగ సాధనలో నైపుణ్యాల ప్రభావం 40% -యండి సిరాజుద్దీన్



**కొడంగల్, (సింగిడి):** ఉద్యోగ సాధనలో 40%నైపుణ్యాల ప్రభా వం ఉంటుందని, 60%అకడమిక్ ప్రభావం ఉంటుందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ మహబూబ్ నగర్ జిల్లా మేనేజర్ యండి సిరాజుద్దీన్ తెలిపారు. గురువారం కొడంగల్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిరాజుద్దీన్ మాట్లాడుతూ, విద్యార్థులకు బేసిక్ మ్యాథ మేటిక్స్, పోటీ పరీక్షలకు అవసరమైన ఆప్టిట్యూడ్, మూర్తిమత్వ అభివృద్ధి, వృత్తిపరమైన అభివృద్ధి,టాలీ, కృత్రిమ మేధా వినియోగం, ఇంటర్వ్యూ స్కిల్స్, మెడికల్ కోడింగ్, స్కిల్ డెవలప్మెంట్ వంటి కోర్సుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల అదనపు ప్రిన్సిపాల్ రఫియా ఖానం,డా,ఆర్, శ్రీనివాస్, డా.కె.రమేష్ బాబు,టి.స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన వ్యక్తి.. దొరకని ఆచూకీ... బోటు సహాయంతో గాలింపు చర్యలు



**కల్వకుర్తి (సింగిడి):** ఊర్కొండ మండలం మాధారం చెరువులో చేపల వేటకు వెళ్లిన రాచాలపల్లికి చెందిన బూర్గుల వెంకటయ్య (46) ప్రమాదవశాత్తు అదుపుతప్పి చెరువులో పడి బుధవారం గల్లంతయ్యారు. 24 గంటలు గడిచినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గురువారం పోలీసులు గల్లంతైన బూర్గుల వెంకటయ్య ఆచూకీ కోసం బోటు సహాయంతో గాలింపు చర్యలను చేశట్టారు. గాలింపు చర్యలను ఎంఆర్ యూసుఫ్ అలీ, ఎస్సై కృష్ణదేవ సమీక్షించారు. గజ ఈతగాళ్లతో చెరువులో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో 286 మంది విద్యార్థులు గైర్హాజర్

**మిర్యాలగూడ (సింగిడి):** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ప్రారంభమైనాయి. ఇంటర్ ద్వితీయ లాంగ్వేజ్ తెలుగు, సాన్స్క్రిట్, ఉర్దూ, హిందీ, అరబిక్, పరీక్షల్లో 256 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు పేర్కొన్నారు. మొత్తం 13,117 మంది విద్యార్థులు లాంగ్వేజ్ పరీక్షకు జనరల్ కేటగిరిలో 11,480 మంది విద్యార్థులు ఒకేషనల్ కేటగిరిలో 1637 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా జనరల్ 11,265, మంది విద్యార్థులు, ఒకేషనల్ 1,566 ఉంది విద్యార్థులు, మొత్తం 12,831 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. కాగా జనరల్ 215 మంది, ఒకేషనల్ 71 మంది, మొత్తం 286 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని 45 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు సజావుగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని మెగా ఉచిత వైద్య శిబిరం



**చేవెళ్ల (సింగిడి):** ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని బిజెపి మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అత్తిలి అనంతరెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం చేవెళ్ల పార్ల మెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మది నాన్ని పురస్కరించుకొని అపోలో ఆసుపత్రి సౌజన్యంతో చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ శిబిరంలో పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని మొత్తం 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పరీక్షల సందర్భంగా 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తిం చారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంతరెడ్డి డాక్టర్ వైభవ్ రెడ్డి మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివా రించుకోవచ్చని తెలిపారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్స్ పెదోళ్ల దయాకర్, మనీషా అనంత్ రెడ్డి, మీనాక్షి సత్యనారాయణ, బీజేపీ నాయకులు మాణిక్య రెడ్డి, శర్వలింగం, ఇంద్రసేన రెడ్డి, అశోక్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అభిశేఖర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, పాగా వెంకటేష్, చాకలి శ్రీనివాస్ కృష్ణరెడ్డి, జైసిమహ రెడ్డి,రవి మరియు బిజెపి నాయకులు గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మిర్జంపేటలో మాజీ ఎమ్మెల్యే దాసరి జన్మదిన వేడుకలు

### గ్రామ శాఖ అధ్యక్షుడు కల్వల కిషన్ రెడ్డి




**సుల్తానాబాద్, (సింగిడి):** పెద్దపల్లి అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జ రుపుకున్నామని కాల్వ శ్రీరాంపూర్ మండలం మి ర్జం పేట గ్రామంలో గ్రామ శాఖ (మూడో వార్డు సభ్యులు) అధ్యక్షుడు కల్వల కిషన్ రెడ్డి స్పష్టం చే శారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పుప్పాల నాగార్జున రావు మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి భగవంతుని ఆశీస్సులతో నిండు నూరేళ్ళు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని భగవంతుని కోరుతున్నామని అన్నా రు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూల శ్యా మల కుమారస్వామి, సిరికొండ సదానందం, పులి రాములు, తిప్పని తిరుపతి, కరుణాకర్ ఎల గందుల అశోక్, ఉయ్యాల సతీష్, చల్ల రాజు, బుర్ర సుమన్, తిప్పని సందీప్, గోపు శ్రీకాంత్, సముద్రాల తిరుపతి, మూల శ్రీను తో పాటు సంజీవ్ ,శ్రీను, ఉయ్యాల ఓదెలు, నరేష్ తదిత రులు పాల్గొన్నారు.

## జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**మహాదేవపూర్ (సింగిడి):** సివి రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ చేసిన తర్వాత ఫిబ్రవరి 28 ప్రతి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని కాటారం డివిజన్ లోని సైన్సు ఉపాధ్యాయుల శిక్షణ సమావేశంలో తీర్మానించినట్లు రిసోర్స్ పర్సన్ ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని కాంప్లెక్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో తీర్మానించినట్లు అయిన వివరించారు. పర్యావరణ పరిరక్షణ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు అనిల్ కుమార్ ఆధ్వ ర్యంలో నిర్వహించగా పలు కీలక అంశాల పట్ల విస్తృత అవగాహన కల్పించిన రిసోర్స్ పర్సన్ లు ప్రభాకర్ రెడ్డి, సంగోతు సతీష్, కుర్రి శ్రీనివాసులను బయాలజీ ఉపాధ్యాయులందరూ శాలు వాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బయాలజీ ఉపాధ్యాయులు సమ్మయ్య, తిరుపతి రెడ్డి, సతీష్ రెడ్డి, రవీందర్, దారం వెంకటేశ్వర్లు, దయానంద స్వామి, భాస్కర్, జయరాజు, మేరీభాయి, సంధ్య, సువర్ణ, శ్రీకాంత్, శ్యాం కుమార్, శ్రీనివాస్, గోపి నాయక్, రాజు, శివజ్యోతి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి...



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో,(సింగిడి)::** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదవ కాలనీకి చెందిన సురిమిండ్ల నయన్ (29) అనే యువకుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో మరో బైక్ వేగంగా నిర్లక్ష్యంగా ఢీకొ నడంతో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. గాయ పడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిం చగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపా రు. కాగా భూపాలపల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించా లని,లిఅధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ చేయకూడదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిం చాలని, రాత్రి సమయంలో వాహనాలు నడిపేట పుడు జాగ్రత్తగా ఉండాలని, యువత ముఖ్యంగా స్టంట్స్, రేసింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజల ప్రాణ భద్రతే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలని ఆయన కోరారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



**కోహెడ, (సింగిడి)::** కోహెడ మండలం చంచల్ చెరువు పల్లిలో బెజ్జంకి అక్షరాస్యత కేంద్రం మరియు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవలు, బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రతినిధులు నావీజీజీడ్, నామీద్, ఖజ ప్రక్రియలతో పాటు బ్యాంకు ఖాతాల నిర్వహణపై గ్రామ ప్రజలకు వివరించారు. సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ ఆడపిల్లల భవిష్యత్ కోసం సుకన్య సమృద్ధి యోజనలో చేరాలని సూచించారు. ఈ పథకం ద్వారా వారు జమ చేసే మొత్తానికి రెట్టింపు లాభం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే బ్యాంకు ఖాతాలను సక్రమంగా నిర్వహించుకోవడం, బీమా సేవలను వినియోగించుకోవడం, సమయానికి రుణాల రీన్యువల్ చేసుకోవడం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తూటి రామ్ రెడ్డి, వార్డ్ సభ్యులు, బీసీఏ లత, సి.ఏ కుమారస్వామి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన దుద్దిల్ల శ్రీనుబాబు



**మహదేవపూర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్మండలం బెగ్లూర్ లో ముల్కల ఓదెలు సత్తెమ్మ కుమార్తె వివాహ వేడుకల్లో టి పిసి సి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొని నూతన వధూవరులనుఆశీర్వదించారు. నూతన వధూవరులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోభూపాలపల్లి జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాపు, మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు అక్బర్ ఖాన్ ,పిఎసిఎస్ మాజీ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్కం అశోక్,విలాస్‌రావు, బుర్రి శివరాజ్,కలికోట వరప్రసాద్, పద్మ,కడార్ల నాగరాజు, తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతం హాజరు శాతం 98.03% నమోదు

### జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్

**సంగారెడ్డి (సింగిడి):** జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు. మొత్తం 15,515 మంది విద్యార్థులకు గాను 15,209 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 14,296 మంది, వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 913 మంది విద్యార్థులు హాజరైనారని తెలిపారు. మొత్తం 306 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, అందులో జనరల్ కోర్సుకు చెందిన 259 మంది, వృత్తి కోర్సుకు చెందిన 47 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం హాజరు శాతం 98.03% నమోదైందనీ,ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు కన్వీనర్/డీఐఈఓ 2 పరీక్ష కేంద్రాలను, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలను, హెచ్‌పీసీ సభ్యులు 5 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు గోవింద్ రామ్ తెలిపారు.

## ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

**కమలాపూర్ (సింగిడి):** రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు మండలంలో రెండో రోజు గురువారం సి సి కెమెరాల నిఘాలో ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఒకటి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెండవది ఆదర్శ పాఠశాల. రెండుపరీక్షా కేంద్రాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రెండోరోజు మొత్తం520 విద్యార్థులను కేటాయిం చగా 514 మంది విద్యార్థులు పరీక్షహాజరుకాగా,ఆరుగురు విద్యా ర్థులు గైర్వాజరు అయ్యారు. ఆదర్శ పాఠశాల పరీక్షాకేంద్రంలో 230 మంది విద్యార్థులు కేటాయించగా 225 మంది విద్యార్థులు హాజర య్యారు. అందులో తెలుగు పేపర్ 190 మంది విద్యార్థులకుగాను 186 మందివిద్యార్థులు పరీక్షకు హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైర్వాజరుఅయ్యారు. సంస్కృతం పేపర్ 21 మంది విద్యార్థులకు గాను మొత్తం విద్యార్థులుహాజర య్యారు. హిందీ పేపర్ 15 మంది విద్యార్థులకు గాను 14 మందివిద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఒకరు గైర్వాజరు అయ్యారని, ఆదర్శ పాఠశాలప్రిన్సిపాల్ పరీక్ష కేంద్రం చీఫ్ సుపరిండెంట్ డా జి అనిత తెలిపారు. అదేవిదంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో జనరల్ 258మందివిద్యార్థులు, 31 మంది ఒకేషల్ విద్యార్థులు, మొత్తం 290 మందివిద్యార్థులలో తెలుగు పేపర్ 258 విద్యార్థులకు గాను 257 మందివిద్యార్థులు హాజరు కాగా, ఒక విద్యార్థి గైర్వాజరయ్యారు. ఒకేషనల్ 31మంది విద్యార్థులు మొత్తం పరీక్షకు హాజరయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాలప్రిన్సిపాల్ పరీక్షా కేంద్రం చీఫ్ సుపరిండెంట్ మాధవి తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పేదల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం

### 3 లక్షల ప్రపోజల్ 'ఎల్ ఓ సి, అందజేసిన భీమ్ భరత్



**చేవెళ్ల(సింగిడి)::** పేదల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వటమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గం నవాబు పేట మండలం మాదిరెడ్డి పల్లీ గ్రామానికి చెందిన దగ్గుల నారాయణ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన భీమ్ భరత్ ని సంప్రదించగా వారు రాష్ట్ర శాసన సభాపతి గౌరవ గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మూడు లక్షల రూపాయల ప్రపోజల్ ఎల్ ఓ సి ను మంజూరు చేశారు. సంబంధిత ప్రపోజల్ ఎల్ ఓ సి చెక్కును గురువారం భీమ్ భరత్ గారి నివాసంలో వారికి అందచేశారు. మంచి వైద్యం అంది, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు..

singidinews@gmail.com



# నేనూ కాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నా

## నటి పరిణీత బోర్తకుర్

సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్‌పై ఎన్నో ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. చాలామంది భయంతో బయటకు చెప్పకుండా మౌనం పాటిస్తుంటే, కొంతమంది మాత్రం సమయం వచ్చినప్పుడు తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను ధైర్యంగా పంచుకుంటున్నారు. తాజాగా ప్రముఖ నటి పరిణీత బోర్తకుర్ కూడా తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఒక షాకింగ్ సంఘటనను బయటపెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పరిణీత బోర్తకుర్ సౌత్ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. సినీ రంగంలో చేదు అనుభవాలు తాను కూడా ఎదుర్కొన్నానని ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ పరిశ్రమలో ఒక మంచి విషయం కూడా ఉందని, ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రవర్తన కూడా కీలకంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఒక దక్షిణాది సినిమా కోసం తన ఫొటోలు షార్ట్‌లిస్ట్ అయ్యాయని సమాచారం వచ్చిందని పరిణీత చెప్పారు. ఆ తర్వాత ఆఫీస్‌కు వెళ్లగా అక్కడ మరికొందరు అభ్యర్థులు కూడా ఉన్నారని తెలిపారు. కొంతసేపటి తర్వాత తననే హీరోయిన్‌గా ఎంపిక చేశామని చెప్పి ఒప్పందంపై సంతకం చేయాలని కోరారని వివరించారు. ఆ సమయంలో అంతా సాధారణంగానే అనిపించిందని, సినిమా అవకాశం రావడంతో ఆనందపడ్డానని గుర్తు చేసుకున్నారు.

# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

## నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ



రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది.

ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.

సిన్మా సింగిడి
Cinma Singidi

ఆదివారం
5-7-2026

10న విడుదలవుతున్న

# లెనిన్

## నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్





**అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.**

అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికా రికంగా ప్రకటిం చారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

Sri Leela



# నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

## నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టర్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737